www.vaarthavedhikasurya.com

PRGI.NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 1 | సంచిక: 300 | శుక్రవారం, 27 మార్చి, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 8 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 1 | ISSUE : 300 | FRIDAY, MARCH 27, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 8 | RS : 5-00 |


## ఇంధన కొరత లేదు

- దేశంలో 60 రోజులకు సరిపడా పెట్రో నిల్వలు • సరఫరాలో ఆటంకాలు లేవు • 40కి పైగా ప్రపంచ సరఫరాదారుల నుంచి క్రూడ్ ఆయిల్ వస్తోంది • దేశంలో రిఫైనరీలు 100 శాతం సామర్థ్యంతో పనిచేస్తున్నాయి • ఎల్పీజీ కూడా సమృద్ధిగా ఉంది • వదంతులను నమ్మొద్దు.. భయం వద్దు
- తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు..
- కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ

2 లో..



# తెల్లారేసరికి సజీవదహనం

- ఎదురెదురుగా ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, కంకర లారీ • 14 మంది సజీవ దహనం • ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయవరం వద్ద దుర్ఘటన • నెల్లూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు • ప్రమాదం అత్యంత విషాదకరం: ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి
- మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటన

ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం మండలం రాయవరం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. గురువారం తెల్లవారుజామున ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ ఎదురెదురుగా ఢీకొని 14 మంది సజీవ దహనం అయ్యారు. మరో 20 మందికి తీవ్రగాయాలు అయ్యాయి. టిప్పర్ ఢీకొని ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అగ్నిప్రమాదం జరిగింది. రెండు వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు.

2 లో..





## ఇక రిజిస్ట్రేషన్‌తో పాటు సర్వేల మ్యాప్

- ఏప్రిల్ 2 నుంచి 5 మండలాల్లో ఇంటిగ్రేటెడ్ భూభారతి కింద ప్రయోగాత్మకంగా అమలు • ఇబ్బందులు గుర్తించాక మార్పులు చేర్పులు • ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి
- ఒక్క క్లిక్‌తో వివరాలు: మంత్రి పొంగులేటి

# విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత

- గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుంటాం • నిధుల్లో కోత విధించబోం
- నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలందించడానికి అవసరమైతే మరిన్ని నిధులు
- బీఆర్ఎస్ చేసిన అప్పుల భారాన్ని ఇంకా మోస్తున్నాం
- 'ఆరోగ్య'శ్రీకి రూ.600 కోట్లు బకాయిలు పెడితే.. తాము ప్రతినెలా రూ.89వేల కోట్లు ఖర్చు పెడుతున్నం
- ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించాం
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి • 'ప్రజావాణి'ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో అమలుకు ప్రణాళిక రూపొందించండి
- ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలి • అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.4,500 కోట్లు పేదల వైద్యానికి ఖర్చు



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-మార్చి 26: ఎన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుంటూనే, నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి, అవసరమైతే మరిన్ని నిధులను సమకూర్చుతామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పేదల వైద్యానికి ఎక్కడా నిధుల కొరత లేకుండా ఇప్పటివరకు అత్యధికంగా నిధులు వెచ్చించినట్టు వివరించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వం గడిచిన 27 నెలల కాలంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్ఓసీ రూపంలో అందించిన ఆర్థిక సహాయానికి సంబంధించిన గణాంకాలను శాసనసభ ముందు వివరించారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రి గారు జోక్యం చేసు కుని అనేక అంశాలను తెలిపారు. "రాష్ట్ర ప్రభు త్వం జరిపిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ సర్వే లెక్కల ప్రకారం తెలంగాణలోని 1.15 కోటి కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయబోతున్నాం. పేదలకు జీవిత బీమాను అందించి వారిలో ధీమా కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెడుతోంది. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.4,500 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశాం. గడిచిన 27 నెలల కాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.2046 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.2,400 కోట్లు మొత్తంగా రూ.4,500 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మిగతా 2లో..

## సీతారాముల వారికి పటు వస్త్రాలు సమర్పించనున్న సీఎం

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడి

భద్రాచలం, (వార్త వేదిక సూర్య)-మార్చి 26: శ్రీ రాముడు నడయాడిన భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద మనస్సుతో నిధులు మంజూరు చేశారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. మొదటి దశలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు తెలంగాణ సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మొత్తం రూ.586 కోట్లతో రామాలయంతో పాటు భద్రాచలం పట్టణాభివృద్ధిని మూడు దశల్లో అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలోని మిథిలా కళ్యాణ మండపం వేదికగా మిగతా 2లో..



## అధికారుల చేతికి బోధనాస్త్రాలు

- ఇందుకు ప్రత్యేకంగా ఓ విభాగం ఏర్పాటు
- డాక్టర్లకు కేవలం చికిత్సలు, రోగుల బాధ్యతే
- టీచింగ్ కాలేజీలకూ ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ • అక్కడి ప్రొఫెసర్లు సర్జరీలు చేస్తే ఇన్సెంటివ్‌లు • విద్య, వైద్యానికి ఒక్క రూపాయి కూడా కోత పెట్టం • మా హయాంలో ఆస్పత్రుల బకాయిలు 127 కోట్లే
- గత సర్కారు బకాయిలను కలిపితే రూ.727 కోట్లు • ప్రైవేటు ఆస్పత్రులకు చెల్లించాల్సింది 231 కోట్లే
- శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2 లో..



## నేడు సీఎంలతో ప్రధాని వర్చువల్ సమావేశం

న్యూఢిల్లీ: పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో రాష్ట్రాల సీఎంలతో ప్రధాని మోదీ శుక్రవారం వర్చువల్ సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్రాల సన్నద్ధత, ప్రణాళిక, సహకారంపై చర్చించనున్నారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడుల తర్వాత సీఎంలతో ప్రధాని సమావేశం కానుండటం ఇదే తొలిసారి. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎన్నికలు జరిగే రాష్ట్రాల సీఎంలు ఈ సమావేశానికి దూరంగా ఉంటారు. ఆ రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలతో కేంద్ర క్యాబినెట్ సెక్రటరీ సమావేశమై సీఎంలతో ప్రధాని సమావేశం వివరాలను తెలియజేస్తారు. కోవిడ్ సమయంలో మాదిరిగా దేశమంతా జట్టుగా ఉంటూ ప్రస్తుత పరిస్థితులను కూడా ఉమ్మడిగా ఎదుర్కొందామని మోదీ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది.

# కళ్యాణ వైభోగమే!

- నేడు మ.12గంటలకు అభిజిత్ లగ్నాన సీతమ్మను పరిణయమాడనున్న రాములోరు • ఇందుకోసం అందంగా ముస్తాబయిన మిథులా ప్రాంగణం • ఈ అపురూప వేడుకను కళ్లారా చూసేందుకు దేశ నలుమూలల నుంచి భద్రాద్రికి భక్తులు • రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరుకానున్న ముఖ్యమంత్రి దంపతులు
- రాములోరి కళ్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

2 లో..



# ఇరాన్‌కు ఎదురుదెబ్బ

## దాడిలో నేవీ చీఫ్ మృతి..

- ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నేవీ చీఫ్ అలీరెజా తంగ్సిరిని దుర్మరణం
- ఈ మేరకు ఇజ్రాయెల్ ప్రకటన విడుదల • ఒప్పందం విషయంలో మరీ ఆలస్యమైతే నష్టం తప్పదు: ట్రంప్ వార్నింగ్ • భారత్‌కు హార్మూజ్ తెరిచే ఉంటుంది
- ఇరాన్ విదేశాంగ మంత్రి



బందర్ అబ్బాస్: ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ కు పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నేవీ చీఫ్ అలీరెజా తంగ్సిరిని ప్రాణాలు కోల్పోయారు. ఈ మేరకు ఇజ్రాయెల్ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇరాన్ తీర ప్రాంత నగరమైన బందర్ అబ్బాస్‌పై జరిపిన దాడుల్లో అలీరెజాతో పాటు మరికొందరు సీనియర్ నౌకాదళ కమాండర్లు మృతి చెందినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. అయితే ఈ విషయంపై ఇరాన్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు. 2018 నుంచి అలీరెజా ఐఆర్‌జీసీ నేవీ చీఫ్ పదవిలో కొనసాగుతున్నారు. హార్మూజ్ జలసంధి మూసివేతను ఆయనే పర్యవేక్షిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇరాన్-అమెరికా మధ్య ఒకవైపు చర్చలు జరుగుతుండగానే మరోవైపు దాడులు కూడా కొనసాగుతున్నాయి. పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగిస్తోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. తాజాగా ఇజ్రాయెల్‌లోని కెఫర్ ఖాసీం ప్రాంతంలో ఐదుగురు, టెల్ అవీవ్‌లో ఇద్దరు గాయపడ్డారు. ఇజ్రాయెల్ సైనిక నియంత్రణ కేంద్రం, అణు మౌలిక సదుపాయలకు సంబంధించిన పరిశ్రమలపై దాడులు చేశామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రకటన చేసింది.

### ఒప్పందం విషయంలో మరీ ఆలస్యమైతే నష్టం తప్పదు: ట్రంప్ వార్నింగ్

ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. ఒప్పందం విషయంలో మరీ ఆలస్యం చేస్తే పరిస్థితులు తీవ్రంగా మారిపోతాయని హెచ్చరించారు. అమెరికాతో ఒప్పందం కోసం ఒకవైపు ప్రయత్నిస్తూనే, బయటకు మరోలా మాట్లాడుతోందని ఇరాన్‌పై మిగతా 2లో..

# విద్య, వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత

(మొదటి పేజీ తరువాయి)

2014నుంచి 6వ డిసెంబర్ 2023 వరకు కింద ప్రతి నెలా సగటున రూ. 52 కోట్లు ఖర్చు పెట్టింది. ఆ తర్వాత 7 డిసెంబర్ 2023 నుంచి 25 మార్చి 2026 కాలంలో ప్రజా ప్రభుత్వం సగటున ప్రతి నెలా రూ. 89 కోట్లు ఖర్చు పెట్టింది. గత ప్రభుత్వం బకాయిల భారాన్ని మాపై పెట్టింది. ఆ భారాన్ని మోస్తూనే.. రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచాం. 7 డిసెంబర్, 2023 నాటికి గత ప్రభుత్వం నుండి రాజీవ్ ఆరోగ్యశ్రీలో వారసత్వంగా వచ్చిన భారం రూ. 600.27 కోట్లు. అందులో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 240.11 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 360.16 కోట్ల బకాయి ఉంది. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నుంచి ఈరోజు వరకు రూ. 2,408.51 కోట్ల ఆరోగ్యశ్రీ నిధులను చెల్లించాం. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 927.99 కోట్లు, ప్రైవేట్ ఆసుపత్రులకు రూ. 1,480.52 కోట్లు చెల్లించాం. నెలకు ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 34 కోట్లు, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 54 కోట్లు అందించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద మొత్తం రూ. 725.75 కోట్లు బకాయి ఉంటే, అందులో గత ప్రభుత్వం బకాయి పెట్టిన మొత్తం రూ. 600 కోట్లు. గత ప్రభుత్వ బకాయి పోగా గడిచిన 28 నెలల కాలంలో ఈ ప్రభుత్వ బకాయి కేవలం రూ. 100 కోట్లు మాత్రమే. ఇందులోనూ ప్రభుత్వ ఆసుపత్రులకే ఎక్కువగా రూ. 496.31 కోట్లు బకాయి ఉంటే, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 231.44 కోట్లు ఉంది. రాష్ట్రంలో నిరుపేదలను ఆదుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. ప్రభుత్వం పేదల్లో ధీమా కల్పించాలన్న సంకల్పంతోనే 1.15 కోట్ల కుటుంబాలకు జీవిత బీమా తెస్తున్నాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స అందడం లేదన్న వాదన వాస్తవం కాదు. సీఎంఆర్ఎఫ్ గతంలో ఎలా దుర్వినియోగమైందో అందరికీ తెలిసిందే. అందుకని మరింత పారదర్శకంగా ప్రజాప్రతినిధులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయడానికి వీలు కల్పించాం. నిమ్స్, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్, వరంగల్ టిమ్స్ వంటి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో పాటు 3 వేల కోట్లతో కొత్తగా నిర్మిస్తున్న ఉస్మానియా ఆసుపత్రి కలిపి రాష్ట్రంలో కొత్తగా 10 వేల పడకల సామర్థ్యంతో అత్యాధునికంగా వైద్యం అందించేలా తీర్చిదిద్దుతున్నాం. పనులు వేగంగా జరుగుతున్నాయి. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద పేదలు వైద్యం కోసం టీచింగ్ హాస్పిటల్స్‌కు పంపిస్తే తద్వారా అక్కడున్న నిపుణులైన వైద్యులతో చికిత్స అందించడానికి అలాగే వైద్య విద్యార్థులకు వృత్తిరీత్యా ఎంతో అనుభవం వస్తుంది. చికిత్స అందించే అనుభవం కలిగిన వైద్యులకు ఇన్సెంటివ్స్ కూడా ఇవ్వాలన్న ఆలోచన చేస్తున్నాం. పేదలకు మరింత వేగవంతమైన నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఆసుపత్రుల నిర్వహణ విధానంలో కూడా మార్పులు చేస్తున్నాం. వైద్యులకే హాస్పిటల్ నిర్వహణ బాధ్యత అప్పగించడం వల్ల వైద్యంపై దృష్టి సారించలేని పరిస్థితులు ఉంటున్నాయి. అందుకని నిర్వహణ విభాగాన్ని వేరు చేయాలన్న ఆలోచన చేస్తున్నాం. విదేశాల్లో గొప్ప పేరు గడించిన వైద్యులు తల్లిదండ్రుల కోసమో, ఇతర పనుల కోసం రాష్ట్రానికి వచ్చినప్పుడు వెసులుబాటును బట్టి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా పేదలకు వారి సేవలను అందించడానికి వీలుగా మెడికల్ అండ్ హెల్త్ వెబ్‌సైట్ ద్వారా ఒక వేదికను క్రియేట్ చేస్తున్నాం. సమాజంలో వైద్య రంగం ఎప్పటికప్పుడు కొత్త సవాళ్లను ఎదుర్కొంటోంది. ప్రజలకు ఉపయోగపడే సూచనలను స్వీకరిస్తాం. ఏది ఏమైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత విద్య, వైద్యం. విద్య పరంగా నర్సరీ నుంచి 10 వరకు, వైద్యం పరంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి స్పెషాలిటీ హాస్పిటల్స్ వరకు ఒక ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. మంచి రోల్ మాడల్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకెళుతున్నాం..." అని ముఖ్యమంత్రి గారు సమగ్రంగా వివరించారు.

## బీఆర్ఎస్ చేసిన అప్పుల భారాన్ని

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకానికి రూ.600 కోట్లు బకాయిలు పెట్టి వెళ్తే తాము ప్రతినెలా రూ.89 కోట్లు ఖర్చు పెడుతున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఇప్పటివరకు రూ.2,408 కోట్ల బిల్లులు చెల్లించామని అసెంబ్లీ సాక్షిగా తెలిపారు. ఏడో రోజైన నేడు(గురువారం) అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సభలో సీఎం రేవంత్ ప్రసంగించారు. ఆరోగ్య శ్రీ కింద ప్రభుత్వాస్పత్రులకు రూ.927 కోట్లు, ప్రైవేట్ ఆస్పత్రులకు రూ.1,480 కోట్లు చెల్లించామని చెప్పుకొచ్చారు. 27 నెలల్లో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు చెల్లించామని ఆయన వివరించారు. పేదలకు అన్యాయం జరుగుతోందని విపక్షాలు అపోహలు సృష్టిస్తున్నాయని.. బీఆర్ఎస్ గత ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎలా దుర్వినియోగం చేశారో అందరికీ తెలుసంటూ విమర్శించారు. ఎవరి పీఏలు సీఎం రిలీఫ్ ఫండ్ కాజేశారో కూడా తెలుసంటూ చురకలు అంటించారు రేవంత్. గత ప్రభుత్వంలో సీఎంఆర్ఎఫ్ నిధులను కొందరు తమ సొంత ఖాతాల్లో వేసుకున్నారని, దీనిపై విచారణ జరుగుతోందన్నారు. త్వరలోనే అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చాక 27 నెలల్లో రూ.2,046 కోట్ల సీఎంఆర్ఎఫ్ కింద ఇచ్చామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అప్పుల భారాన్ని తమకు వారసత్వంగా ఇచ్చిందని, ఆ బకాయిలను తామే చెల్లిస్తున్నామని చెప్పారు రేవంత్ రెడ్డి. బీఆర్ఎస్ గత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ కోసం నెలకు రూ.52 కోట్లు ఖర్చు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నెలకి రూ.89 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. ఆరోగ్య శ్రీ ఇవ్వకపోవడం వల్ల చికిత్స చేయట్లేదు అనేది అపోహ మాత్రమే అన్నారు. ఇన్ని ఇబ్బందుల్లో కూడా ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. విద్యా, వైద్యం విషయంలో కోతలు ఉండవని సీఎం రేవంత్ మరోసారి తేల్చి చెప్పారు. కోతలు పెట్టాల్సి వస్తే వేరే కోతలు పెడతామని అన్నారు. టీచింగ్ కాలేజీల నిర్వహణ గ్రూప్-1 అధికారులకు అప్పగిస్తామని, ప్రతి కుటుంబానికి జీవిత బీమా అందించేందుకు కొత్త పథకం తీసుకువస్తున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు.

## 'ప్రజావాణి'ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో అమలుకు ప్రణాళి రూపొందించండి

ప్రజా సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో కూడా నిర్వహించడానికి సంబంధించి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శాసనమండలి సమావేశ హాలులో ముఖ్యమంత్రితో ప్రముఖ సామాజిక కార్యకర్త నిఖిల్ డే నేతృత్వంలోని ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా భేటీ అయింది. ప్రజా సమస్యల పరిష్కారానికి అనుసరిస్తున్న విధానాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా ప్రశంసించారు. తెలంగాణలో ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో చేపడుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయికి తీసుకెళ్లడంపై ఈ సమావేశంలో చర్చించారు. అందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. రాజస్థాన్ ప్రభుత్వం చేపడుతున్న "జన్ సూచన పోర్టల్" తరహాలో తెలంగాణలోనూ ప్రజా సూచన పోర్టల్ ఏర్పాటు చేయాలని చర్చ జరిగింది. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న అన్ని పథకాలకు సంబంధించిన వివరాలను ఒకే చోట అందుబాటులో ఉండే విధంగా ఈ పోర్టల్ రూపొందించనున్నారు. ఐటీ శాఖ ఆధ్వర్యంలో ఈ పోర్టల్‌ను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. తెలంగాణ గిగ్ వర్కర్స్ బిల్‌ను ఈ సందర్భంగా నిఖిల్ డే గారు ప్రశంసించారు. ఈ చట్టం దేశంలోనే చారిత్రాత్మకంగా నిలుస్తుందని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, సిస్ రామకృష్ణారావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల సమీకరణతో పాటు సమర్థ వినియోగానికి ప్రత్యేక పాలసీ రూపొందించాలని ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. సీఎస్ఆర్ నిధులతో రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టే కార్పొరేట్ సంస్థలను ప్రభుత్వం తరపున అభినందించాలని సూచించారు. ప్రతి ఏడాది అత్యుత్తమ భాగస్వామ్యం అందించిన సంస్థల ప్రతినిధులను అభినందించేందుకు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయాలని చెప్పారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఈ అభినందన కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో సీఎస్ఆర్ సెల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. శాసనమండలి సమావేశ హాలులో ముఖ్యమంత్రి సిఎస్ఆర్ నిధులపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని కార్పొరేట్ కంపెనీలు సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న కార్యక్రమాల వివరాలు, అన్ని ప్రభుత్వ విభాగాల్లో అందుబాటులో ఉన్న ప్రాజెక్టులు, సీఎస్ఆర్ ద్వారా చేపట్టేందుకు వీలున్న కార్యక్రమాల వివరాలన్నీ సమన్వయం చేసే బాధ్యతలను రాష్ట్రస్థాయి సెల్ నిర్వర్తిస్తుందని తెలిపారు. ప్రభుత్వానికి, కార్పొరేట్ సంస్థలకు అనుసంధానంగా ఉండేలా ప్రత్యేకంగా తెలంగాణ సీఎస్ఆర్ పోర్టల్ రూపొందించాలని ఆదేశించారు. కార్పొరేట్ సంస్థలు సీఎస్ఆర్ విరాళాలను ఇచ్చేందుకు, వివిధ విభాగాల పరిధిలో చేపట్టేందుకు వీలున్న ప్రాజెక్టుల వివరాలన్నీ పోర్టల్‌లో పొందుపరచాలన్నారు. కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వాన్ని సంప్రదించేందుకు, తమకు అనువైన ప్రాజెక్టులను ఎంచుకునేందుకు వీలుగా ఈ పోర్టల్ ఆకర్షణీయంగా తయారు చేయాలని చెప్పారు. జాతీయ స్థాయిలో సీఎస్ఆర్ నిధుల వాటా మన రాష్ట్రంలో కేవలం 3 శాతం మాత్రమే ఉందని అధికారులు ముఖ్యమంత్రి గారికి నివేదించారు. ఇప్పటి వరకు వచ్చిన సీఎస్ఆర్ ఫండ్స్ ఆశించిన స్థాయిలో లేవని, తెలంగాణలో కంపెనీలు, పరిశ్రమలు ఏర్పాటు చేసి సీఎస్ఆర్ నిధులను వేరే చోట ఖర్చు పెడితే ఎలా అని ముఖ్యమంత్రి గారు ప్రశ్నించారు. రాష్ట్రానికి మరిన్ని సీఎస్ఆర్ నిధులు రావాల్సిన అవసరం ఉందని, మన రాష్ట్రంలో ఉన్న కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు తెలంగాణలోనే ఎక్కువ సీఎస్ఆర్ ఖర్చు పెట్టేలా చూడాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో సీఎస్ఆర్ సమీకరణకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని చెప్పారు. ఈ వాటాను పెంచుకునేందుకు వీలుగా కొత్త పాలసీ ఉండాలని, కార్పొరేట్ సంస్థలను ఆకర్షించే విధానాలను అనుసరించాలని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు గారితో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలి

రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ ఇకాన్ రాష్ట్ర శాసనమండలి హాల్‌లో ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, సిఎస్ రామకృష్ణారావు పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో 0 - 10 ఏళ్లలోపు పిల్లల్లో పోషకాహార లోపం, విద్యాభ్యాసన స్థాయి సామర్థ్య లోపాలకు సంబంధించి పలు నివేదికలను కార్తీక్ మురళీధరన్ గారు దృష్టికి తెచ్చారు. చిన్న వయసులో పోషకాహారం లోపం వల్ల భవిష్యత్‌లో తలెత్తే ఆరోగ్య సమస్యలు, ప్రాథమిక స్థాయిలో సరైన బోధన లభించకపోతే విద్యార్థి భావి జీవితంలో పడే మానసిక వేదనను ఆయన తెలియజేశారు. వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన అంశాలను సూచించారు. ఆయా అంశాలపై తాము ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధ పెట్టామని ముఖ్యమంత్రి తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం పెట్టేందుకు బడ్జెట్‌లో కేటాయింపులు చేసినట్లు వివరించారు. అంగన్‌వాడీల్లో కార్యకర్తలు, ఆయాలతో పాటు పోషకాహారం అందజేసేందుకు అదనంగా మరొకరిని నియమించాలని కార్తీక్ మురళీధరన్ సూచించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు పోషకాహారం అందజేసేందుకు పోషణ సఖి పేరుతో మరొకరిని నియమించేందుకు అవకాశం ఉందని అధికారులు తెలియజేశారు. మురళీధరన్ సూచించే అంశాలను కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలోని 29 స్కూల్ కాంప్లెక్స్‌లలో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి గారు అధికారులకు సూచించారు. మురళీధరన్ గారితో సమన్వయం చేసుకొని ఈ అంశంపై ప్రత్యేక నివేదిక రూపొందించి సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

## అధికారుల చేతికి బోధనాస్పత్రులు

ప్రభుత్వ ఆస్పత్రులు, వాటి అనుబంధ వైద్య కళాశాలల నిర్వహణ బాధ్యతను గ్రూప్-1, 2 అధికారులకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు శాసనసభలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేశారు. ''పెద్ద పెద్ద చదువులు చదువుకున్న డాక్టర్లకు ఆస్పత్రుల నిర్వహణ బాధ్యతలు ఇస్తే.. ఊడ్చేవాళ్లు.. తుడిచేవాళ్లు.. మిగతా సిబ్బంది వచ్చిన్రా లేదా అని చూసుకోవడానికే సరిపోతోంది. రోగులకు చికిత్స చేయడంతోపాటు నర్సు వచ్చిండా.. వాచ్‌మెన్ వచ్చిండా.. పార్కింగ్ ఎలా ఉంది తదితరాలన్నీ చూసుకోవాల్సి వస్తోంది. వాళ్లు చదువుకున్న చదువుకు, మైండ్ సెట్‌కు, వాళ్ల వ్యవహార శైలికి ఈ బాధ్యత సరిపోదు. చికిత్సను, ఆస్పత్రి నిర్వహణను వేరు చేయాలనుకుంటున్నాం. ఇందుకు ప్రత్యేకంగా ఒక వింగ్ ఏర్పాటు చేస్తాం. ప్రత్యేకంగా గ్రూప్-1, 2 అధికారులను నియమించి నిర్వహణ బాధ్యత అప్పగిస్తాం. రోగులకు చికిత్స బాధ్యతను ప్రొఫెషనల్ డాక్టర్లకు అప్పగించాలనుంటున్నాం'' అని ప్రకటించారు. వైద్యాన్ని, ఆస్పత్రుల నిర్వహణను వేరు చేయాలని అనుకుంటున్నామని చెప్పారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ అంశంపై బీఆర్ఎస్ ఉప నేత హరీశ్ రావుతోపాటు పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు గురువారం సీఎం రేవంత్ రెడ్డి జవాబిచ్చారు. ''నిధుల సమస్య వస్తే ఇంకెక్కడైనా కోత విధిస్తాం. కానీ, పేదల విద్య, వైద్యం విషయంలో ఒక్క రూపాయి కూడా కోత పెట్టం. విద్య, వైద్యమే మా ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం. ప్రజలకు పోషకాహారాన్ని అందించనున్నాం. నాణ్యమైన, నైపుణ్య విద్యనూ అందిస్తాం. ఇందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం'' అని తెలిపారు. రాష్ట్రంలోని టీచింగ్ కాలేజీలకు ఆరోగ్యశ్రీ రోగులు రావడం లేదని, రోగులు వెళ్లే ఆస్పత్రుల్లో నిపుణులు లేరని, ఈ సమస్యను పరిష్కరించే దిశగా ఆలోచన చేస్తున్నామని చెప్పారు. టీచింగ్ కాలేజీలకు ఆరోగ్యశ్రీ రోగులను పంపించాలని భావిస్తున్నామని, అప్పుడు అక్కడి విద్యార్థులకూ మరింత అవగాహన పెరుగుతుందని తెలిపారు. టీచింగ్ ఆస్పత్రులకూ ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ ఇస్తామని, అక్కడ చికిత్సలు చేసే ప్రొఫెసర్ డాక్టర్లకు ప్రత్యేక ఇన్సెంటివ్‌లు ఇవ్వాలని భావిస్తున్నామని వెల్లడించారు.

# ఇరాన్‌కు ఎదురుదెబ్బ..

(మొదటి పేజీ తరువాయి)

ఆగ్రహం వ్యక్తం చేశారు. మరీ ఆలస్యం కాకముందే సీరియస్‌గా వ్యవహరించడం మంచిదని హితవు పలికారు. ఇరాన్ మిలిటరీ పూర్తిగా నాశనమైంది. తిరిగి పుంజుకునే అవకాశం లేదు. దీంతో వారు ఒక ఒప్పందం కోసం మమ్మల్ని వేడుకుంటున్నారు. మరోవైపు మా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని చెబుతున్నారు. వారు చాలా తప్పు చేస్తున్నారు. మరీ ఆలస్యం కాకముందే వారు ఒక నిర్ణయం తీసుకుంటే మంచిది. ఆలస్యమైతే వెనక్కి తిరిగి చూసే ప్రసక్తే లేదు. పరిస్థితులు తీవ్రంగా ఉంటాయి అని తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ ద్వారా హెచ్చరించారు. అమెరికాతో చర్చల పట్ల ఇరాన్ భిన్నంగా ప్రకటనలు చేస్తోంది. ఘర్షణలు ముగించేందుకు చర్చలు జరిపే ఉద్దేశం ఉద్దేశం తమకు లేదని, అమెరికా ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి వ్యాఖ్యానించారు. అమెరికాతో చర్చలు జరుగుతున్న సమయంలో పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులకు పాల్పడుతోంది.

## భారత్‌కు హోర్ముజ్ తెరిచే ఉంటుంది

పశ్చిమాసియాలో యుద్ధం ఉధృతంగా సాగుతున్న నేపథ్యంలో భారత్ సహా ఐదు మిత్ర దేశాలకు చెందిన నౌకలను హోర్ముజ్ జలసంధిలో అడ్డగించబోమని ఇరాన్ గురువారం ప్రకటించింది. భారత్‌తోపాటు రష్యా, చైనా, పాకిస్థాన్, ఇరాక్‌కు చెందిన నౌకలను సురక్షితంగా జలసంధి గుండా పంపిస్తామని ఇరాన్ వెల్లడించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రభుత్వ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. హోర్ముజ్‌ను పూర్తిగా మూసివేయలేదని, ఇరాన్‌తో స్నేహపూర్వక సంబంధాలు ఉన్న అనేక దేశాలు జలసంధి గుండా ప్రయాణించేందుకు అనుమతిస్తామని ఆయన చెప్పారు. ఈ నౌకల యజమానులు లేదా దేశాలు మమ్మల్ని సంప్రదించి జలసంధి గుండా ఆ నౌకలు సురక్షితంగా ప్రయాణించేందుకు సహకరించాలని కోరారు. వీటిలో కొన్నింటిని మా మిత్రదేశాలుగా పరిగణిస్తున్నాము. లేదా ఇతర కారణాలతో అనుమతిస్తున్నాము. ఆ నౌకలు సురక్షితంగా ప్రయాణించేందుకు మా సాయుధ దళాలు సహాయపడుతున్నాయి అని ఆయన చెప్పినట్లు రాయిటర్స్ వార్తాసంస్థ పేర్కొన్నది.

# సీతారాముల వారికి పటు వస్త్రాలు సమర్పించనున్న సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

స్వామివారి కళ్యాణం జరుగుతుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి తుమ్మల పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. శ్రీసీతారామచంద్రస్వామి దంపతులకు ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలను సీఎం రేవంత్ రెడ్డి సమర్పించనున్నారని తెలిపారు. అందుకు శుక్రవారం భద్రాచలానికి సీఎం రేవంత్ వస్తున్నారన్నారు. ఆయనకు ప్రజల తరఫున ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. భద్రాచలం వచ్చే భక్తుల సౌకర్యార్థం జాతీయ రహదారులు, రైల్వే కనెక్టివిటీ, ఎయిర్ పోర్టు ఏర్పాటు దిశగా అడుగులు వడివడిగా పడుతున్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరిలో నావిగేషన్ సిస్టమ్ ఏర్పాటుకు అవకాశం ఉందని మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే పనులు చేపట్టినట్లు చెప్పారు. సీతారాముల కళ్యాణం వీక్షించే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై దేవాలయం అధికారులు, సిబ్బందికి మంత్రి తుమ్మల దిశా నిర్దేశం చేశారు.

# రిజిస్ట్రేషన్‌తో పాటు సర్వే మ్యాప్

హైదరాబాద్, (వార్త వేదికసూర్య)-మార్చి26:

ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ద్వారా భూముల రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్‌ను అందజేస్తామని, ఈ కార్యక్రమాన్ని ఏప్రిల్ 2 నుంచి ఎంపిక చేసిన ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నారాయణ పేట జిల్లా కోస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కూసుమంచి, కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలాల్లో దీన్ని అమలు చేస్తామని తెలిపారు. తొలిదశలోని ఇబ్బందులను గుర్తించి, అవసరమైన మార్పులు చేశాక ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి తెస్తామన్నారు. ఈ నూతన విధానం వల్ల ఒకే క్లిక్‌తో భూముల వివరాలన్నీ తెలుస్తాయని, సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు అన్నీ సేవలు ఒకే గొడుకు కిందకు వస్తాయని, ప్రతి సర్వే నంబరుకు భూధార్ నంబరు ఉంటుందని వివరించారు. రైతులకు పారదర్శకమైన సేవలను అందించడమే లక్ష్యంగా భూ పరిపాలనలో ఈ విధానాన్ని నూతన శకంగా అభివర్ణించారు. సచివాలయంలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. భూ పరిపాలన సేవలను వేగవంతంగా అందించేందుకు రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుకు కిందకు తీసుకొచ్చేలా భూ భారతి పోర్టల్‌ను అభివృద్ధి చేసినట్లు వివరించారు. ప్రతి భూ లావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా ఈ పోర్టల్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను అమలు చేయడం వల్ల భూ వివాదాలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఐదు మండలాల్లో ప్రతి సర్వే నంబరుకు భూధార్ కార్డు కూడా ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షాలేని ఐదు గ్రామాల్లో రీ సర్వే నిర్వహించి భూధార్ నంబరును కేటాయించినట్లు చెప్పారు. ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబరు ద్వారా లాగిన్ అయ్యాక అవసరమైన సమాచారం లభిస్తుందన్నారు. సర్వేకు సంబంధించిన సేవలు, సవరణలు, అప్పీళ్లు, రిజిస్ట్రేషన్ సేవలు, సిటిజన్ డ్యాష్‌బోర్డుకు సంబంధించి మై ల్యాండ్ పోర్టుపోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్స్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్ బ్యాక్ వ్యవస్థ, సంబంధిత అధికారుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నంబర్లు, దరఖాస్తుదారు వివరాలు, మ్యుటేషన్, ఈసీ, మార్కెట్ విలువలు, విలేజ్ మ్యాప్, సర్వే నంబర్ల వారీ మ్యాప్‌లు అందుబాటులో ఉంటాయన్నారు.

# కల్యాణ వైభోగమే!

భద్రాచలం, (వార్త వేదిక సూర్య)-మార్చి 26:

భద్రాచలం ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం.ఇది పుణ్య తీర్థం కూడా.ఇక్కడ ప్రతి యేట సాంప్రదాయబద్ధంగా శ్రీ సీతారాముల వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ ఏడాది ఆ ఘడియలు రానే వచ్చాయి. నేడు (శుక్రవారం) మధ్యాహ్నం ఖచ్చితంగా 12 గంటలకు అభిజిత్ లగ్నాన రాములోరు సీతమ్మవారిని పరిణయ మాడనున్నారు. ఇందుకోసం మిథులా ప్రాంగణం అందంగా ముస్తాబయింది. ఈ అపురూప వేడుకను కళ్లారా చూడాలని దేశ నలుమూలల నుంచి నుంచి భక్తులు వేలాది సంఖ్యలో భద్రగిరికి పయనమయ్యారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ కళ్యాణ మహోత్సవానికి హాజరవుతున్నారు. ప్రభుత్వం తరపున శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. ముఖ్యమంత్రితో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, ఉన్నతాధికారులు ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొననున్నారు. శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం భద్రాచలంలో అన్ని ఏర్పాట్లను చేసింది. రాష్ట్ర జిల్లా అధికార యంత్రాంగం తుది ఏర్పాట్లపై నిమగ్నమైంది. ఇదిలా ఉండగా భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందుతోంది

# ఇంధన కొరత లేదు

**న్యూఢిల్లీ:** దేశంలో ఇంధన కొరత లేదని కేంద్ర ప్రభుత్వం మరోమారు స్పష్టం చేసింది. దేశంలో 60 రోజులకు సరిపడా పెట్రో నిల్వలు ఉన్నాయని వెల్లడించింది. ఇంధనం విషయంలో భయపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చింది. ఆయిల్ సరఫరాలో కూడా ఎలాంటి ఆటంకాలు లేవని తెలిపింది. అన్ని రిటైల్ అవుట్‌లెట్లలో చాలినంత నిల్వలు ఉన్నాయని చెప్పింది. ఇంధన కొరత ఉందంటూ కొందరు సృష్టిస్తున్న వదంతులను నమ్మవద్దని, భయపడొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కేంద్ర చమురు, సహజవాయు మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకటనలో వివరాల ప్రకారం.. ''హోర్ముజ్ జలసంధి వద్ద ఆందోళనకర పరిస్థితులు ఉన్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా 40 మంది సరఫరాదారుల నుంచి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముడి చమురు దేశానికి వస్తోంది. దేశంలోని ఆయిల్ రిఫైనరీలు కూడా వంద శాతం సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. దేశంలో అందరికీ సరిపోయేలా 60 రోజులకు సరిపడా నిల్వలు ఉన్నప్పటికీ, రిజర్వు నిల్వలతో కలిపి 74 రోజులకు సరిపోతుంది. ఇంధన నిల్వలు ఆరు రోజులకు మాత్రమే సరిపోతాయంటూ ఆన్‌లైన్‌లో తప్పుడు సమాచారం ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. కొన్ని పోస్టులు, వీడియోలతో ప్రజల్లో లేనిపోని భయాన్ని సృష్టిస్తున్నా రు. అధికారిక సమాచారంపై మాత్రమే ప్రజలు ఆధారపడాలి. పశ్చిమాసియా సంక్షోభం మొదలై 27 రోజులైంది. దేశంలో రెండు నెలల పాటు స్థిరంగా సరఫరా చేయడానికి సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయి. అదనంగా నిల్వలు సేకరించడానికి కూడా తగిన చర్యలు తీసుకున్నాం. వచ్చే నెలలకు కూడా ఇంధన భద్రత కల్పిస్తాం. అన్ని అవుట్‌లెట్లు సాధారణంగానే నడుస్తున్నాయి. ఇంధన సరఫరాలో ఎక్కడా పరిమితులు లేవు. అతి పెద్ద రిఫైనరీలు కలిగిన దేశాల్లో భారత్ ఒకటి. పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల్లో మన దేశం ప్రధాన పాత్ర పోషిస్తోంది. సోషల్ మీడియాలో వదంతులతోనే ప్రజలు భయపడి పెట్రోల్ బంకులకు క్యూ కడుతున్నారు. అలాగే దేశంలో ఎక్కడా ఎల్పీజీ కొరత లేదు. సరఫరాను కూడా బలోపేతం చేశాం. దేశీయ ఉత్పత్తి కూడా గణనీయంగా పెరిగింది. రోజువారీ అవసరాల్లో 50 శాతం పైగా దేశీయంగానే ఉత్పత్తి అవుతోంది. దీనివల్ల దిగుమతులు కూడా తగ్గాయి. ఇదే సమయంలో అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా నుంచి భారీగా ఎల్పీజీ వస్తోంది. దేశవ్యాప్తంగా ఎలాంటి సమస్యలు లేకుండా రోజుకు 50 లక్షల సిలిండర్ల డెలివరీ జరుగుతోంది. మొదట్లో కొద్దిగా పెరిగిన డిమాండ్ ఇప్పుడు సాధారణ స్థాయికి చేరుకుంది.

# తెల్లారేసరికి సజీవదహనం

ప్రకాశం/అమరావతి, (వార్త వేదిక సూర్య)-మార్చి 26:

మార్కాపురం మండలం రాయవరం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. గురువారం తెల్లవారుజామున ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, కంకర లోడుతో వెళ్తున్న టిప్పర్ ఎదురెదురుగా ఢీకొని 14 మంది సజీవ దహనం అయ్యారు. మరో 20 మందికి తీవ్రగాయాలు అయ్యాయి. టిప్పర్ ఢీకొని ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అగ్నిప్రమాదం జరిగింది. రెండు వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేస్తున్నారు. బాధితులను మార్కాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తెలంగాణ రాష్ట్రం నిర్మల్ నుంచి ఏపీలోని నెల్లూరుకు బస్సు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది.

## మృతుల వివరాలు ఇవే..

అంబటి అనిల్, అంబటి లియో (పెద్దరికట్ల గ్రామం), తమ్మిశెట్టి పిచ్చమ్మ, తమ్మిశెట్టి రుక్మిణి (చల్లగిరిగల గ్రామం కనిగిరి మండలం), ఉప్పు రమాదేవి, బత్తుల పద్మ (తింగారెడ్డిపల్లి గ్రామం కనిగిరి మండలం), ముత్తంగి వెంకటేశ్వర్లు (చల్లగిరిగల గ్రామం కనిగిరి మండలం), నర్సింగ్ ప్రభావతి, నర్సింగ్ క్షేత్ర(6 సంవత్సరాలు) మృతి చెందారు. మొత్తం 13 మంది చనిపోగా.. వారిలో 9 మందిని గుర్తించారు. మరో నలుగురి వివరాలు తెలియాల్సి ఉంది.

## నెల్లూరులో కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

మార్కాపురంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై బాధితుల సహాయార్థం నెల్లూరు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో 7995575699, 08612331261 నంబర్లతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. నెల్లూరు జిల్లాకు సంబంధించిన 15 మంది ప్రయాణికులు బస్సులో ఉన్నట్లు సమాచారం ఉందన్నారు. ప్రమాదానికి సంబంధించిన వివరాల కోసం పైన తెలిపిన కంట్రోల్ రూమ్ నంబర్లను సంప్రదించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా వెల్లడించారు.

## ప్రమాదం అత్యంత విషాదకరం.. ప్రధాని మోదీ

ప్రకాశం జిల్లాలోని మార్కాపురం సమీపంలో జరిగిన ప్రమాదం అత్యంత విషాదకరమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత ప్రజలు, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని చెప్పారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని, ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50,000 ఎక్స్ గ్రేషియా పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి అందిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ మేరకు పీఎంఓ కార్యాలయం ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, ప్రకాశం జిల్లాలోని మార్కాపురం మండలం రాయవరం సమీపంలో ప్రయాణికులతో వెళ్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును టిప్పర్ ఢీకొన్న ఘటనలో బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. ఈ దుర్ఘటనలో పలువురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రానికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.

## ప్రమాదంపై సీఎం చంద్రబాబు సమీక్ష..

ప్రకాశం జిల్లా మార్కాపురంలో జరిగిన ఘోర బస్సు ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంపై మంత్రులు అనిత, జనార్ధన్ రెడ్డితో పాటు పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా ఎస్పీ, కలెక్టర్‌తో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రమాదం జరిగిన తీరుపై ప్రాథమిక సమాచారాన్ని ముఖ్యమంత్రికి జిల్లా ఎస్పీ, కలెక్టర్ వివరించారు. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 35 మంది ప్రయాణికులు ఉన్నారని సీఎంకు తెలిపారు. ఈ దుర్ఘటనలో 13 మంది చనిపోయారని, 22 మంది గాయపడి వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని అధికారులు చెప్పారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని ముఖ్యమంత్రికి వివరించారు. హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన ఈ బస్సు జగిత్యాల నుంచి వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదంపై డ్రైవర్‌ను విచారించగా.. తన వాహనం స్టీరింగ్ స్టక్ అయ్యిందని చెప్పాడని.. దీనిపై నిజానిజాలను అధికారులు పరిశీలిస్తున్నారని సీఎంకు తెలియజేశారు. బస్సు పూర్తిగా ఆపోజిట్ రూట్‌లో వెళ్లడం వల్లనే ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నామని అధికారులు వెల్లడించారు. గాయపడిన వారిలో పరిస్థితి విషమంగా ఉన్నవారిని గుంటూరు ఆసుపత్రికి తరలించే ఆలోచనలో ఉన్నామని సీఎంకు జిల్లా కలెక్టర్ తెలిపారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, బాధిత కుటుంబాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు.




# శ్రీరామనవమి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయండి

## మాజీ కార్పొరేటర్ - డాక్టర్ హేమ కూడా



సికింద్రాబాద్, మార్చి 26(వార్త వేదిక సూర్య)

శ్రీరామనవమి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖల అధికారులకు మాజీ కార్పొరేటర్ డా.సామల హేమ గారు కోరారు ఆలయ చుట్టుపక్కల ఎప్పటికప్పుడు చెత్త పేరుకుపోకుండా శానిటేషన్ సిబ్బంది సమన్వయం చేసుకోవాలని కోరారు ఈ సందర్భంగా ప్రజలకు శ్రీరామనవమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు సీతాఫలమండి మాజీ కార్పొరేటర్ డా.సామల హేమ గారు తన పదవి కాలం పూర్తయినప్పటికీ డివిజన్ లోని సమస్యలపై అధికారుల సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంది ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ గారి నేతృత్వంలో డివిజన్ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు గత వారం రోజుల నుండి ఆమెకు ఆరోగ్యం బాలేక ప్రజల మధ్యకు రాలేకపోయింది పది రోజుల పాటు విశ్రాంతి అవసరం అని ఆమెకు డాక్టర్లు సూచించారు వారం రోజుల అనంతరం మళ్ళీ ప్రజల మధ్యలోనే ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె తెలిపారు



## అభివృద్ధి పనులను పర్వేక్షించిన మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక నరేష్

సికింద్రాబాద్, మార్చి 26(వార్త వేదిక సూర్య)

మోండా మార్కెట్ డివిజన్ పరిధిలోని గురుద్వారా, రెజిమెంటల్ బజార్ పలు ప్రాంతాల్లో జరుగుతున్న సిసి రోడ్ పనులను గురువారం స్థానిక మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ పర్వేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. స్థానికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు అదేవిధంగా పనుల్లో నాణ్యతమైన విషయంలో రాజిపడకూడదాని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ అధ్యక్షులు జితూగుప్తా, ప్రశాంత్ జైన్ తదితరులున్నారు

## సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దాకు నాయక్ ను కలిసిన మాజీ కార్పొరేటర్ - కొంతం దీపిక నరేష్

సికింద్రాబాద్, మార్చి 26(వార్త వేదిక సూర్య)



బోయినపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ దాకు నాయక్ ను గురువారం మోండా మార్కెట్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం డివిజన్ పరిధిలో ఉన్న శానిటేషన్, స్వీపింగ్ పనుల పై చర్చించారు. అదేవిదంగా శుక్రవారం రోజున జరగబోయే శ్రీరామనవమి వేడుకలను దృష్టిలో ఉంచుకుని శ్రీరామ ఊరేగింపు మార్గాలు, కళ్యాణ మహోత్సవం జరిగే ప్రాంతాల్లో పారిశుధ్యం నిర్వహించేందుకు ప్రత్యేక పారిశుధ్య బృందాన్ని ఏర్పాటు చేయాలని కోరారు

## విద్యుత్ ఆర్టిసన్ కార్మికుల సమ్మె

### -డిమాండ్ల పరిష్కారానికి జేఏసీ పిలుపు

మైలర్ దేవ్ పల్లి, మర్చి 26 ( వార్త వేదిక సూర్య ) :



తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఉద్యోగుల సంయుక్త చర్య కమిటీ పిలుపు మేరకు గురువారం రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ శాఖ కార్మికులు సమ్మెకు దిగారు. ఆర్టిసన్ కార్మికులను ఒకే సంధిలోకి తీసుకురావాలని, ఏపీఎస్ఈబీ నిబంధనలు మరియు విద్యార్హతల ఆధారంగా 04-12-2016 నాటికి అర్హతలు ఉన్నప్పటికీ ఇంకా విలీనం కాని కార్మికులను ఆర్టిసన్లుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు.అలాగే టీజీఎస్పీడీసీఎల్, టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులను ఆర్టిసన్లుగా గుర్తించడంతో పాటు 2026 వేతన సవరణను వెంటనే అమలు చేయాలని జేఏసీ నాయకత్వం కోరింది.

ఈ నేపథ్యంలో 26 న అన్ని విభాగ కార్యాలయాల్లో కార్మికులు సమ్మె నిర్వహించారు. రాజేంద్రనగర్ విభాగ కార్యాలయంలో సర్కిల్ చైర్మన్, సర్కిల్ కన్వీనర్ స్వామి, విభాగ చైర్మన్ కాజా పాషా, విభాగ కన్వీనర్ సీతారాం నాయక్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్మికులు సమ్మెలో పాల్గొని తమ డిమాండ్లను వినిపించారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేశారు

# కాటేడాన్ ఐలాలో సమస్యల తిష్ట!





### - రోడ్లు, వీధి దీపాలు, చెత్త నిర్వహణ అస్తవ్యస్తం

### - అధికారుల నిర్లక్ష్యంపై ఉస్కామూరి విజయ్ కుమార్ ఆగ్రహం

మైలర్ దేవ్ పల్లి, మర్చి 26 ( వార్త వేదిక సూర్య ) :

అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని కాటేడాన్ ఇండస్ట్రియల్ ఏరియా (ఐలా) సమస్యల సుడిగుండంలో చిక్కుకుంది. ఇక్కడి రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఉస్కామూరి విజయ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఐలా ప్రాంతంలో పర్యటించి, స్థానికులు ఎదుర్కొంటున్న కష్టాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు.

**మృత్యుపాశాలుగా మారిన రోడ్లు :**

ఐలా ప్రాంతంలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని, వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదానికి గురవుతారో తెలియని భయానక స్థితి నెలకొందని విజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. "కోట్లాది రూపాయల ఆదాయం సమకూర్చే ఈ ప్రాంతంపై ఇంత వివక్ష ఎందుకు?" అని ఆయన ప్రశ్నించారు. వర్షం పడితే ఈ రోడ్లు చెరువులను తలపిస్తున్నాయని, కనీసం నడవడానికి కూడా వీల్లేకుండా తయారయ్యాయని మండిపడ్డారు.

**అంధకారంలో పారిశ్రామిక వాడ :**

పారిశ్రామిక వాడలో రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగకపోవడం వల్ల అటు కార్మికులు, ఇటు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇది నేరస్తులకు అడ్డాగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

చీకటిని ఆసరాగా చేసుకుని అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నా అధికారులు పట్టించుకోకపోవడం వెనుక మర్మమేంటని నిలదీశారు.

**మురుగు నీరు.. ముక్కుపుటలు**

**అదిరే దుర్వాసన :**

పారిశుధ్య నిర్వహణ పూర్తిగా అస్తవ్యస్తమైందని, వారం రోజులుగా చెత్త తరలించకపోవడంతో వీధులన్నీ నరకాన

# నిర్లక్ష్యపు నీడలో బుల్బుల్ కుంట, మద్దికుంట చెరువులు





### - నిలిచిపోయిన అభివృద్ధి పనులు.. పేరుకుపోయిన చెత్తాచెదారం

### హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించాలి: ఆడికే మహేందర్, ఆడికే సత్యనారాయణ



మైలర్ దేవ్ పల్లి, మర్చి 26 ( వార్త వేదిక సూర్య ) :

హైడ్రా' నడుం బిగించినా, క్షేత్రస్థాయిలో కొన్ని చెరువుల పరిస్థితి మాత్రం దయనీయంగా మారింది. అత్తాపూర్ సర్కిల్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ రెవెన్యూలో ఉన్న బుల్బుల్ కుంట, మద్దికుంట చెరువులు నేడు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్ల కోట్లాది రూపాయల నిధులు మంజూరైనా అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కోటి 60 లక్షల నిధులు ఏమయినట్లు? లక్ష్మీగూడ సర్వే నెంబర్ 53లోని బుల్బుల్ కుంట చెరువు సుమారు 10 ఎకరాల 12 గుంటల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు అభివృద్ధి కోసం ప్రభుత్వం గతంలో రూ. 1.60 కోట్లు మంజూరు చేసింది. పనులు ప్రారంభమై రెండు నెలలు జరిగినప్పటికీ, గత ఏడాది కాలంగా పనులు పూర్తిగా నిలిచిపోయాయి. పనులు ఎందుకు ఆగిపోయాయో అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని లక్ష్మీగూడ చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షులు ఆడికే మహేందర్ మండిపడ్డారు. చెరువు చుట్టూ రక్షణ కంచె (ఫెన్సింగ్) లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది వ్యక్తులు రాత్రివేళల్లో ఇక్కడ ఇస్ మెటల్, నిర్మాణ వ్యర్థాలను కుమ్మరిస్తున్నారని సమితి ప్రధాన కార్యదర్శి ఆడికే సత్యనారాయణ ఆరోపించారు. దీనికి తోడు డ్రైనేజీ నీరు చేరడంతో గుర్రపు డెక్క పేరుకుపోయి, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, దీనివల్ల స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సర్వే నెంబర్ 103లోని మద్దికుంట చెరువు పరిస్థితి మరీ దారుణంగా తయారైంది.

# వాంబే కాలనీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఘనత: 9 మందికి గురుకుల సీట్లు



మైలర్ దేవ్ పల్లి,మర్చి, 26 ( వార్త వేదిక సూర్య ) :

రాజేంద్రనగర్ మండల పరిధిలోని వాంబే కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్) విద్యార్థులు 2026 విద్యా సంవత్సరానికి నిర్వహించిన టీజీ గురుకుల్ సెట్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ పాఠశాల నుండి ఏకంగా తొమ్మిది మంది విద్యార్థులు ఐదవ తరగతి ప్రవేశాలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్ బుధవారం ప్రకటించారు. ఒకే పాఠశాల నుండి తొమ్మిది మంది విద్యార్థులు గురుకుల సీట్లు సాధించడం పట్ల స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది. ఎంపికైన వారిలో వర్షిత, మానస, నందన, దీపాక్షి, రాజా, మణికుమారి, లక్ష్మి, మహేశ్వరి, మరియు త్రిష ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రాణించడం గమనార్హం.

సీట్లు సాధించిన విద్యార్థులను రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రాథోడ్, కాంప్లెక్స్ హెచ్ఎం మరియు పాఠశాల చైర్మన్ అండాలు ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థుల కష్టానికి, ఉపాధ్యాయుల కృషి తోడవడంతోనే ఈ ఫలితాలుసాధ్యమయ్యాయని వారు కొనియాడారు.ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గోవర్ధన్‌తో పాటు ఉపాధ్యా యులు సి. శ్రీనివాసరెడ్డి, తిరుపతయ్య, మరుద్వతి, మంజుల, మదార్, మరియు పుష్పలత తదితరులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు



## గండిపేట్ మండలంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు కాంగ్రెస్ నాయకుల విజ్ఞప్తి

మైలర్ దేవ్ పల్లి, మర్చి 26 ( వార్త వేదిక సూర్య ) :

రాజేంద్రనగర్ నియోజకవర్గం గండిపేట్ మండల్ పరిధిలోని జిహెచ్ఎంసి 121, 122, 123 డివిజన్‌లలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను పూర్తి స్థాయిలో చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి స్థానిక సమస్యలను వివరించారు.ప్రాంతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, రహదారుల మరమ్మతులు, కాల్వల శుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారిపురం కుమార్, మాజీ కార్పొరేటర్ గోకరి శ్రీలత, సురేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ బి. సాగర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారురాలికి చెక్ అందజేత

మైలర్ దేవ్ పల్లి, మర్చి 26 ( వార్త వేదిక సూర్య ) :



హైదర్షాకోట్ గ్రామానికి చెందిన లావేటి శైలజకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ మంజూరు చేయబడింది. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారురాలికి చెక్‌ను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అవసరమైన సమయంలో ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం పేద ప్రజలకు ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. ప్రజలు ఇలాంటి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సంతోష్ ముదిరాజ్, మాజీ వార్డు సభ్యుడు రవికాంత్ రెడ్డి, నాయకులు సంజీవ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంపుటి 1 సంచిక 300 వార్త వేదిక సూర్య హైదరాబాద్ శుక్రవారం, మార్చి 27, 2026

## గండిపేట్‌లో టిబి ముక్త్ భారత్ అభియాన్ ఆరోగ్య శిబిరం

# విజయవంతం





**మైలర్ దేవ్ పల్లి, మర్చి 26 ( వార్త వేదిక సూర్య ) :**
టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గండిపేట్ ప్రాంతంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రజలకు టిబి పరీక్షలు, ఛెస్ట్ ఎక్స్-రే, హెచ్‌బి పరీక్షలు, ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా. లలిత కుమారి, డా. శ్రీదేవి, డా. సుష్మ, కౌన్సిలర్ గణేష్ పాల్గొన్నారు. అలాగే టిబి సూపర్వైజర్లు రహీమ్, అర్చన, హెచ్‌ఈఓ సల్మాన్, ఎస్‌ఎన్ రామరెడ్డి, హెచ్‌వీ మధుబాబు, ఏఎన్ఎమ్‌లు లక్ష్మి, సుజాత, యాదమ్మ, తేజ్, ఎల్‌టీఎస్ స్వప్న మరియు ఆశా కార్యకర్తలు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.




## రాష్ట్ర ప్రజలందరికి శ్రీరామనవమి పండుగ శుభాకాంక్షలు : రామినేని వెంకటేశ్వర్లు (ఆర్.వి)

**సికింద్రాబాద్, మార్చి 26(వార్త వేదిక సూర్య)**



తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మరియు పరిసర ప్రాంతాల ప్రజలందరికి తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టియుటిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు పెరిక పురగురి క్షత్రియ కుల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు (ఆర్.వి) శ్రీరామ నవమి శుభాకాంక్షలు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనా మాట్లాడుతూ...మంచి తనయుడు, మంచి సోదరుడు, మంచి భర్త, మంచి పాలకుడు..లోకంలో ఎంత మంచి ఉందో అవన్నీ కలగలపిన పరిపూర్ణమైన రూపం శ్రీరామచంద్రుడు. అందుకే సకల గుణాభిరాముడు అంటారు. శ్రీ మహా విష్ణువు అవతారాల్లో అన్నీ భగవంతుడిగానే కనిపిస్తాడు...కానీ...రామావతారంలో మాత్రం మానవుడిగా అనుగ్రహిస్తాడు. మనిషిగా పుట్టినందుకు ఎలా బతకాలి? ఎలాంటి జీవితాన్ని గడపాలి? వ్యక్తిత్వం ఎలా ఉండాలి? అందరి మంచికోసం ఎలా ఆలోచించాలి? ధర్మం తప్పకుండా ఎలా జీవించాలి? జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను సమానంగా ఎలా స్వీకరించాలి? ఇవన్నీ నేర్పించిన రూపం రామచంద్రుడు అని పేర్కొన్నారు

## నల్గొండ జిల్లా మహిళా ఐఎన్టీయూసీ సంయుక్త కార్యదర్శిగా బరిగెల అనూష ముదిరాజ్ నియామకం

**నల్లగొండ బ్యూరో, మార్చి 26 (వార్తా వేదిక సూర్య )**



నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం షాపల్లి గ్రామానికి చెందిన బరిగెల అనూష ముదిరాజ్‌ను జిల్లా మహిళా ఐఎన్టీయూసీ సంయుక్త కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా మహిళా ఐఎన్టీయూసీ జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా ఉపాధ్యక్షురాలు గోలి శ్రావణి రెడ్డి, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు అమ్మంటి సోమయ్య చేతుల మీదుగా ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అనూష ముదిరాజ్ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన ఐఎన్టీయూసీ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జి. సంజీవరెడ్డి, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఐఎన్టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగయ్య గౌడ్, జిల్లా అధ్యక్షుడు అమ్మంటి సోమయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ఐఎన్టీయూసీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు.

# నేడే రాములోరి కళ్యాణం

## కొండమల్లేపల్లి లో ఘనంగా ఏర్పాట్లు

**దేవరకొండ, మార్చి 26 ( వార్తలు వేదిక సూర్య):-**





శ్రీ సీతారాముల కళ్యాణానికి కొండమల్లేపల్లి శ్రీ సీతారామచంద్రమౌళీశ్వర ఆంజనేయస్వామి అయ్యప్ప సహిత దేవాలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని, పట్టణంలో నాలుగు రహదారుల వెంట విద్యుత్తు తోరణాలు ( దీపాలు), కాషాయ జండాలతో అలంకరణ చేశారు. శుక్రవారం నిర్వహించే శ్రీ సీతారామ స్వామి వారి కళ్యాణాకి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని అన్నారు. పురోహితులు దేవతామూర్తుల విగ్రహాలను అత్యంత సుందరంగా అలంకరించారు. దీంతో ఆలయం దేదీప్యమానంగా వెలుగుతుంది. రెండు రోజులుగా స్వామి వారి కళ్యాణానికి హడావుడి మొదలైంది. పట్టణంతో పాటు పరిసర ప్రాంత ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయం చేయాలని అన్నారు. కళ్యాణానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం, తీర్థ ప్రసాదాలు, స్వామివారి తలంబ్రాలు అందిస్తామన్నారు

# రాజేంద్రనగర్ విభజనపై అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గళం

### మూడు ముక్కల నియోజకవర్గంపై తీవ్ర అభ్యంతరం

### ఒకే కమిషనరేట్ పరిధిలోకి తేవాలని డిమాండ్

**మైలర్ దేవ్ పల్లి, మర్చి 26 ( వార్త వేదిక సూర్య ) :**
ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గ భౌగోళిక విభజన అంశం చర్చకు వచ్చింది. నియోజకవర్గాన్ని మూడు వేర్వేరు పాలనా విభాగాలుగా విడదీయడం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అసెంబ్లీ వేదికగా గళమెత్తారు. జీహెచ్ఎంసీ పునర్వ్యవస్థీకరణ పేరుతో రాజేంద్రనగర్‌ను అస్తవ్యస్తం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే ఊరు.. మూడు జోన్లు



రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రస్తుతం సైబరాబాద్, హైదరాబాద్

మరియు ఫ్యూచర్ సిటీ అనే మూడు వేర్వేరు పరిధుల కిందకు రావడంపై ఎమ్మెల్యే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకే నియోజకవర్గం మూడు వేర్వేరు కమిషనరేట్ల కింద ఉండటం వల్ల సామాన్య ప్రజలు ఏ పని నిమిత్తం ఏ కార్యాలయానికి వెళ్లాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. వేర్వేరు జోన్ల వల్ల అభివృద్ధి పనుల నిర్వహణలోనూ, పోలీసు యంత్రాంగం మధ్య సమన్వయం లోపిస్తోందని ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. అధికారుల మధ్య స్పష్టత లేకపోవడం వల్ల ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని, ఇది నియోజకవర్గ ప్రగతికి ఆటంకంగా మారిందని వివరించారు. ప్రజల సౌకర్యార్థం రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని పూర్తిగా సైబరాబాద్ లేదా ఫ్యూచర్ సిటీ పరిధిలోకి తీసుకువచ్చి, ఏదైనా ఒకే కమిషనరేట్ కింద ఉంచాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరిపాలనను క్రమబద్ధీకరించి, విభజన లోపాలను వెంటనే సరిదిద్దడం ద్వారా నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేయాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఫుట్ పాత్‌ల ఆక్రమణలపై హైడ్రా 'పంజా'





### మైలర్ దేవ్ పల్లీ - ఆరంఘర్ దారిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

**మైలర్ దేవ్ పల్లి, మర్చి 26 ( వార్త వేదిక సూర్య ) :**
రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని అత్తాపూర్ సర్కిల్‌లో ఆక్రమణదారులపై అధికారులు ఉక్కుపాదం మోపారు. మైలర్ దేవ్ పల్లీ నుండి ఆరంఘర్ వెళ్లే ప్రధాన రహదారిపై ఫుట్ పాత్‌లను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను జిహెచ్ఎంసి మరియు హైడ్రా అధికారులు గురువారం సంయుక్తంగా కూల్చివేశారు.

గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఫుట్ పాత్‌లను కొందరు వ్యాపారులు, స్థానికులు ఆక్రమించి మెట్లు, షెడ్లు, కంచెలు ఏర్పాటు చేశారు.

దీనివల్ల పాదచారులు రోడ్డుపై నడవాల్సి వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో అత్తాపూర్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య పర్యవేక్షణలో భారీ బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ..

ఫుట్ పాత్‌లు కేవలం పాదచారుల కోసమేనని, వాటిని ఆక్రమిస్తే ఎంతటి వారైనా వదిలేది లేదని స్పష్టం చేశారు. ముందస్తు హెచ్చరికలు జారీ చేసినా స్పందించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు, హైడ్రా సిబ్బంది మరియు పోలీసులు పాల్గొన్నారు.



## రాష్ట్ర ప్రజలందరికి శ్రీరామనవమి పండుగ శుభాకాంక్షలు

### ఎంపిపిఎస్ ఆర్కెపురం ఎస్జిటి: సయ్యద్ రూహి

**సికింద్రాబాద్, మార్చి 26(వార్త వేదిక సూర్య)**
తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మరియు పరిసర ప్రాంతాల ప్రజలందరికి తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టియుటిఎఫ్) ఎంపిపిఎస్ ఆర్కెపురం ఎస్జిటి సయ్యద్ రూహి శ్రీరామనవమి శుభాకాంక్షలు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధర్మం కోసం నిలబడిన ఆదర్శమూర్తి, అన్యాయాన్ని ఎదిరించిన అసమాన వీరుడు... ఆ శ్రీరాముని ఆశీస్సులు ప్రతి ఒక్కరి జీవితంలో ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షిస్తున్నాను

# శాంతిభద్రతలను కాపాడాలి




### రిటైర్డ్ డీజీపీ అంజనీ కుమార్ తెలంగాణ పోలీస్ అకాడమీలో ప్రొబేషనరీ డీఎస్పీలకు ప్రత్యేక శిక్షణ

**మైలర్ దేవ్ పల్లి, మర్చి 26 ( వార్త వేదిక సూర్య ) :**
పట్టణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా మతపరమైన అంశాల్లో లౌకిక భావజాలంతో వ్యవహరించాలని రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అంజనీ కుమార్, ఐపీఎస్ పిలుపునిచ్చారు. గురువారం రాజేంద్రనగర్‌లోని ఆర్‌బీవీఆర్‌ఆర్ తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ లో ప్రొబేషనరీ డిప్యూటీ



సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శిక్షణార్థుల కోసం అర్బన్ సొసైటీలో కమ్యూనలిజం మరియు లా ఢ ఆర్డర్ పై దాని ప్రభావం అనే అంశంపై ప్రత్యేక గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, ఐపీఎస్ నిర్ణయం మేరకు, శిక్షణార్థులకు సీనియర్ అధికారుల అనుభవాలను పంచుకునే క్రమంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అంజనీ కుమార్ మాట్లాడుతూ.. పట్టణ సమాజంలో చిన్నపాటి మతపరమైన వివాదాలను నిర్లక్ష్యం చేస్తే, అవి పెద్ద కలహాలకు దారితీసి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తాయి. అందుకే క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి అని హెచ్చరించారు. పోలీస్ అధికారులు కేవలం వృత్తిపరంగానే కాకుండా, సామాజిక బాధ్యతతో, మంచి హృదయంతో ప్రజలకు సేవ చేయాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసులు తమ నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని ఆయన కోరారు. సమాజంలోని అన్ని వర్గాలను సమానంగా గౌరవించాలని, 'కమ్యూనిటీ పాలిసింగ్' ద్వారా ప్రజలతో బలమైన సంబంధాలు ఏర్పరచుకోవడం వల్ల నేర నియంత్రణ సులభమవుతుందని వివరించారు. సమగ్ర సమాచార వ్యవస్థ (ఇంటలిజెన్స్ నెట్వర్క్)ను అభివృద్ధి చేసుకోవడం ద్వారానే ప్రజలకు త్వరితగతిన న్యాయం చేయగలమని తెలిపారు.

సంపుటి 1 సంచిక 300 వార్త వేదిక సూర్య హైదరాబాద్ శుక్రవారం, మార్చి 27, 2026



## చౌటుప్పల్, నారాయణపురం

### అక్రమ అరెస్టులకు, అక్రమ కేసులకు విద్యార్థి ఉద్యమాల వేగు చుక్క

# ఎస్ఎఫ్ఐ అదరదు బెదరదు

**నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అడిగిన డివైఎఫ్ఐ నాయకుల ను అక్రమ అరెస్టులు చేయడాన్ని ఖండిస్తున్నాం**

**స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాల్సిందే**

**ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మం పాటి శంకర్**




నల్లగొండ బ్యూరో, మార్చి 26 (వార్తా వేదిక సూర్య )

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సుభాష్ చంద్రబోస్ విగ్రహం ఎదుట. రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తామని. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగ సమస్యలను గాలికి వదిలేసిన గాలి ముఖ్యమంత్రి . పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయమని అడిగిన విద్యార్థి సంఘ నాయకుల పై అక్రమ కేసులు పెట్టి అక్రమంగా అరెస్టు చేస్తే పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించి. విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామంటే. తెలంగాణ విద్యార్థులు చూస్తూ ఊరుకోరని. కెసిఆర్ లాంటి నియంత పైనే ఎన్నో ఉద్యమాలు చేసి విద్యార్థుల పాపం తగిలి కెసిఆర్ గద్దె దిగడం జరిగింది. భవిష్యత్తులో స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి అదే గతి పడుతుందని హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వంలో, ఇందిరమ్మ రాజ్యంలో, ప్రజా పాలనలో అక్రమ అరెస్టు లు ఉండమని చెప్పిన ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్రంలో పోలీసులతో రాజ్యాన్ని ఏ విధంగా కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు.

గురువారం నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని. అసెంబ్లీ ముట్టడికి వెళ్లిన డి వై ఎఫ్ ఐ నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ అరెస్టు చేసిన నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

భవిష్యత్తులో విద్యార్థుల నిరుద్యోగ సమస్యలు పరిష్కరించకుంటే. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, యువకులను కూడగట్టి సమరశీల పోరాటాల నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో నల్గొండ డివిజన్ కార్యదర్శి మారుపాక కిరణ్ డివిజన్ ఉపాధ్యక్షులు నవదీప్, పట్టణ నాయకులు అదిల్, వరుణ్, యువరాజ్, మధు, శివ,సంధ్య,కావ్య, స్పందన,పావని, కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి

నల్లగొండ బ్యూరో, మార్చి 26 (వార్తా వేదిక సూర్య )

కనగల్ మండల కేంద్రంలో రూ. 6 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యాభివృద్ధి ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ నూతన కళాశాల భవనం నిర్మాణంతో స్థానిక విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు. ఉన్నత విద్యను కొనసాగించేందుకు మరింత అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. నిర్మాణ పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేసి త్వరగా విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారుల ను మంత్రి ఆదేశించారు.

## పెండింగ్ లో ఉన్న 10 వేల కోట్ల స్కాలర్షిప్లు, ఫీజు రీయింబర్స్మెంట్లు వెంటనే విడుదల చేయాలి

**డిగ్రీ, పీజీ, బిఈడి, ఫార్మసీ కాలేజీల బంద్ : పి.డి.ఎస్.యూ**

నల్లగొండ బ్యూరో, మార్చి 26 (వార్తా వేదిక సూర్య )




తెలంగాణ రాష్ట్రశీలో పెండింగ్లో ఉన్న 10వేల కోట్ల స్కాలర్ షిప్పులు, ఫీజు రియంబర్స్ మెంటు నిధులను వెంటనే విడుదల చేయకపోతే ముఖ్యమంత్రిని రోడ్లపై తిరగనివ్వమని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి డి ఎస్ యూ) జిల్లా అధ్యక్షులు పోలె పవన్ అన్నారు. విద్యార్థులకు రావాల్సిన ఉపకార వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పి.డి.ఎస్.యూ. తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ, ప్రొఫెషనల్ కాలేజీల బందుకు పిలుపునిచ్చింది. నల్లగొండ జిల్లా కేంద్రంలో బంద్ ను నిర్వహించి ఎన్. జీ కాలేజ్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోలె పవన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చి 25 నెలలు గడిచిపోయిందని, అధికారంలోకి వస్తే విద్యారంగానికి 15% నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని , పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేస్తామని ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం రెగ్యులర్గా నిధులను విడుదల చేస్తామని నమ్మ బలికిందని . కానీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి ఆయన దగ్గర నుండి ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లు విడుదల చేయడానికి మనసు రావడం లేదని అన్నారు . దాదాపు 10 వేల కోట్ల పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్లు విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం బాకీ పడిందని తెలిపారు. ఈ నిధుల విడుదలకు విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, విద్యాసంస్థల యాజమాన్యాలు దశలవారీగా ఉద్యమాలు నిర్వహిస్తున్నారని, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్స్ కోసం పిడిఎస్ యు అనేక ఉద్యమాలు నిర్వహించిందని, జిల్లాల్లో కలెక్టరేట్లను, మంత్రుల ఇండ్లను, హైదరాబాదులో మినిస్టర్ క్వార్టర్ను ముట్టడించిందని, పలు దపాలు ఛలో అసెంబ్లీ నిర్వహించి కేసులను సైతం ఎదుర్కొన్నదని, 2026 జూలై మొదటి వారంలో 72 గంటల పాటు బందు నిర్వహించిందని, ముఖ్యమంత్రి ఇంటిని ముట్టడించి నిర్బంధాన్ని ఎదుర్కొన్నదని. ఎన్ని పోరాటాలు చేసినా ప్రభుత్వానికి చలనం రావడం లేదని ఏద్దేవా చేశారు, ప్రభుత్వం ఇలాగే మొండిగా వ్యవహరిస్తూ విద్యార్థులను నిర్లక్ష్యం చేస్తే రేవంత్ రెడ్డి ని ఎక్కడికక్కడ రోడ్ల మీదకి రాకుండా అడ్డుకుంటామని పి.డి.ఎస్.యూ.గా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు, కాబట్టి ప్రభుత్వం వెంటనే బడ్జెట్లో విద్యారంగానికి, స్కాలర్షిప్లకు అధిక నిధులు కేటాయించాలని, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్కు ఇవ్వాల్సిన 218 కోట్ల పెండింగ్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ నాయకులు గుండబోయిన హరీష్, కె. రాము, బి. నగేష్, యం.క్రాంతి, రాకేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ అండ్ బి ఈఎన్సి డిప్యూటీ పద్మజ కి వినతి పత్రం అందజేసిన 3 వ డివిజన్ కార్పొరేటర్ పేర్ల మల్లీశ్వరి, అశోక్ చంద్ర

**లెప్రసి కాలనీ వద్ద మూసివేసిన రోడ్డు క్రాసింగ్ ను రీ ఓపెన్ చేయాలి**

**కేశరాజు పల్లి బైపాస్ వద్ద నుండి పాత పల్లె కు వెళ్ళే రోడ్డు క్రాసింగ్ వద్ద వైట్ స్పీడ్ బ్రేకర్స్ ను ఏర్పాటు చేయాలి**



నల్లగొండ బ్యూరో, మార్చి 26 (వార్తా వేదిక సూర్య )

అద్దంకి బైపాస్ రోడ్డు లెప్రసి కాలనీ వద్ద మూసివేసిన రోడ్డు క్రాసింగ్ ను రీ ఓపెన్ చేయాలని, పాతపల్లె రోడ్డు క్రాసింగ్ వద్ద వైట్ స్పీడ్ బ్రేకర్ వేయాలని 3 వ డివిజన్ కార్పొరేటర్ పేర్ల మల్లీశ్వరి, అశోక్ చంద్ర లు ఆర్ అండ్ బి ఈఎన్సి డిప్యూటీ పద్మజ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా 3 వ డివిజన్ కార్పొరేటర్ పేర్ల మల్లీశ్వరి, అశోక్ చంద్ర లు మాట్లాడుతూ.. నల్లగొండ మున్సిపాలిటీ 3 వ డివిజన్ పరిధిలోని ఎస్ హెచ్ 2 అద్దంకి బైపాస్ రోడ్డు. పానగల్ బైపాస్ నుండి మిర్యాలగూడ వైపున కు వెళ్ళే బైపాస్ రోడ్డు కు ఎడమ వైపున లెప్రసి కాలనీ, రిక్షా పుల్లర్ కాలనీ ఉన్నాయి. ఈ కాలనీ ల్లో 300 కుటుంబాలు నివసిస్తున్నారు. లెప్రసి కాలనీ, రిక్షా పుల్లర్ కాలనీ ల్లోకి వెళ్ళేందుకు వీలుగా కాలనీల వద్ద రోడ్డు క్రాసింగ్ గతం లో ఇచ్చారు. కానీ అప్పుడు క్రాసింగ్ సిగ్నల్ ఏర్పాటు చేయలేదు. గత రెండు సంవత్సరాల క్రితం ఆ క్రాసింగ్ ను మూసివేశారు. అప్పటి నుండి కాలనీ వాసులు నల్లగొండ కు వెళ్ళాలంటే 2 కిలోమీటర్ల మేర రాంగ్ రూట్లో ప్రయాణించవలసి వస్తుంది. రాంగ్ రూట్లో ప్రయాణించడం తో గతంలో అనేక సార్లు రోడ్డు ప్రమాదాలు జరిగి కాలనీ వాసులు గాయపడ్డారు. దీంతో పాటు లెప్రసి కాలనీ ప్రజలు అంగ వైకల్యం ఉన్నవారు కావడం తో రాంగ్ రూట్లో ప్రయాణించడం కష్టం గా మారింది. గతం లో ఏర్పాటు చేసిన క్రాసింగ్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేసి, వైట్ స్పీడ్ బ్రేకర్స్ వేసి.మూసివేసిన రోడ్డు క్రాసింగ్ ను రీ ఓపెన్ చేయాలని కోరారు. దీంతో పాటు కేశరాజు పల్లి బైపాస్ వద్ద నుండి పాత పల్లె, శేషమ్మ గూడెం, తనేధార్ పల్లి వెళ్ళే రోడ్డు క్రాసింగ్ వద్ద అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వెంటనే రోడ్డు క్రాసింగ్ వద్ద వైట్ స్పీడ్ బ్రేకర్స్ ను ఏర్పాటు చేసి పాత పల్లె, శేషమ్మ గూడెం, తనేధార్ పల్లి ప్రజల ప్రాణాలను కాపాడాలని వారు కోరారు.

# ఐద్వా ఆధ్వర్యంలో సభ్యత్వం చేర్పింపు కార్యక్రమం



## నూతన కమిటీ ఎన్నిక

నల్లగొండ బ్యూరో, మార్చి 26 (వార్తా వేదిక సూర్య )

మహిళల హక్కుల రక్షణ కోసం పోరాడేది ఐద్వా మాత్రమేనని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి పేర్కొన్నారు. గురువారం నకిరేకల్ మండలం తాటికల్ గ్రామంలో ఐద్వా ఆధ్వర్యంలో సభ్యత్వం చేర్పింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తాటికల్ గ్రామ నూతన కమిటీని ఎన్నిక చేశారు.

ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ, సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వెళు తున్నప్పటికీ, ఇంకా వారిని రెండవ పౌరులుగా చూస్తున్నారని విమర్శించారు. కొందరు మహిళలను వంటింటికే పరిమితం చేయాలని ప్రయత్నిస్తున్నారని అన్నారు.మహిళలు లేనిదే సమాజానికి మనుగడ లేదని పేర్కొంటూ, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐద్వా ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటాలు, ఉద్యమాలు నిర్వహించి అనేక చట్టాలను సాధించుకున్నామని తెలిపారు. అయినప్పటికీ మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు, వేధింపులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.చట్టాలను అమలు చేయాల్సిన వారే వాటిని ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. యువతి, యువకులు మరియు మహిళలు పెద్ద ఎత్తున ఉద్యమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ను ఆమోదించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాలో మహిళల సమస్యలపై ఐద్వా ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. మహిళలు విరివిగా సంఘంలో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు నాగమణి, జిల్లా కమిటీ సభ్యురాలు బహూరోజు ఇందిరా, పొన్నాల శశికళ, గ్రామ అధ్యక్షురాలుగా చెనగోని జయమ్మ,పిట్ట లక్ష్మి, బండమీది యాదమ్మ, ఏరుకొండ లక్ష్మి, టి సుశీల, ఉప్పమ్మ తదితరులు పాల్గొన్నారు.



## రైతు భరోసాను పూర్తిస్థాయిలో అమలు చేయాలి

**కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వా లక్ష్మీ నర్సయ్య**

నల్లగొండ బ్యూరో, మార్చి 26 (వార్తా వేదిక సూర్య )



రైతు సమస్యల పై నల్లగొండ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు గడ్డం వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు మెమోరాండం అందజేశారు. ముఖ్యంగా రైతు భరోసాను పూర్తిస్థాయిలో అమలు చేయాలని. అలాగే పెండింగ్ లో ఉన్న రైతు భరోసా డబ్బులు కూడ వెంటనే రైతుల ఖాతాల్లో జమ చెయ్యాలని, వరి కోతలు ప్రారంభం కానున్నందున ఏప్రిల్ నెలలోనే ఐ. కె. పి. సెంటర్లు ప్రారంభించాలని, పెండింగ్ లో ఉన్న బోనస్ డబ్బులు వెంటనే రైతుల ఖాతాల్లో జమ చెయ్యాలని, ఫామాయిల్ ఫ్యాక్టరీ పనులు సత్వరమే పూర్తి చెయ్యాలని. అలాగే వి.బి.జి.రామ్ జి . పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చెయ్యాలని మెమోరాండం అందజేసారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి గా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వా లక్ష్మీ నర్సయ్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి. బీజేపీ సెంట్రల్ హైదరాబాద్ జిల్లా ఇంచార్జ్ వీరెల్లి చంద్రశేఖర్. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదగోని శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర భూ నిర్వాసితుల సెల్ కన్వీనర్ భవనం మధుసూదన్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి. కిసాన్ మోర్చా రాష్ట్ర కోశాధికారి కన్మత రెడ్డి అశోక్ రెడ్డి. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతేపాక లింగస్వామి, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గుండా నవీన్ రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. బీజేపీ 1 వ పట్టణ అధ్యక్షులు మిరియాల వెంకటేశం,బీపంగి జగ్జీవన్,పిండి పాపిరెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు రావెళ్ల కాశమ్మ కిసాన్ మోర్చా సీనియర్ నాయకురాలు ఇరిగి చిలకమ్మ మొదలైనవారు పాల్గొన్నారు.

సంపుటి 1 సంచిక 300 వార్త వేదిక సూర్య హైదరాబాద్ శుక్రవారం, మార్చి 27, 2026



## కాలిపోయిన పాత మోటర్ ని తొలగించి కొత్త మోటర్ ను ఏర్పాటు చేసి నీరు సౌకర్యం

దేవరకొండ మార్చ్ 26 (వార్త వేదిక సూర్య):
కొండమల్లేపల్లి పట్టణం 8వ వార్డులో కాలిపోయిన పాత మోటర్ ని తొలగించి కొత్త మోటర్ ను ఏర్పాటు చేసి నీరు సౌకర్యం కల్పించి, నీటిని విడుదల చేయడం జరిగింది. ఎండాకాలం దృష్టిలో పెట్టుకొని నీటిని పొదుపుగా వాడుకోవాలని సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొడిదాల పద్మ వెంకటయ్య వార్డ్ మెంబర్ గంట మల్లేష్ మరియు వస్కుల వెంకటేష్, అంజి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు

## క్రీడా విద్యార్థులను అభినందించిన కే ఎం పీ హెల్పింగ్ హాండ్స్

దేవరకొండ మార్చ్ 26 (వార్త వేదిక సూర్య):-





తెలంగాణ సోలిడార్ బదిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు గుజరాత్ రాష్ట్రంలోని అమ్మదాబాదులో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి క్రీడలలో పాల్గొని పథకాలు సాధించారు. ఆల్ ఇండియా స్పోర్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ది డేఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ పోటీలలో తెలంగాణ నుండి 19 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనగా సోలిడార్ తెలంగాణ బదిరిల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు 11 మంది విజయం సాధించారు. ఇందులో ఇద్దరు గోల్డ్ మెడల్ సాధించారు, ముగ్గురు సిల్వర్ మెడల్ సాధించారు, మరో ఆరుగురు బ్రౌన్ మెడల్ సాధించారు. ఐ రాజశేఖర్ హై జంపులో గోల్డ్ మెడల్,కె అజయ్ హేమర్ త్రో లో గోల్డ్ మెడల్, ఎం శివ ట్రిపుల్ జంపులో సిల్వర్ మెడల్, పి చిన్నారి హై జంప్ లో సిల్వర్ మెడల్, ఎన్ చందన హై జంప్లో సిల్వర్ మెడల్, ఎన్ జస్వంత్ లాంగ్ జంప్ లో బ్రౌన్ మెడల్, బి తేజస్విని హై జంబులో బ్రౌన్ మోడల్,ఎం సింధు హై జంబులో బ్రౌన్ మెడల్, ఎం పూజ జావలింత్రోలో బ్రౌన్ మెడల్, వి చరణ్ ట్రిపుల్ జంపులో బ్రౌన్ మెడల్,పి ఈశ్వర్ హై జంపులో బ్రౌన్ మెడల్, బి అక్కి హై జంప్ లో బ్రౌన్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా పథకాలు సాధించిన విద్యార్థులను కేఎంపి హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు గురువారం పాఠశాలకు వెళ్లి విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కృషి పట్టుదలతో పథకాలు సాధించడం అభినందనీయమని వారన్నారు. పాఠశాల క్రీడా విద్యార్థులకు కేఎంపి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు,ఇటీవల జాతీయస్థాయిలో ఆడేందుకుగాను 20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు విద్యార్థులు కేఎంపి హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కెఎంపి హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు ఏరుకొండ రాము, కూన భానుచందర్, కొలనుపాక యుగేందర్, పొగాకు మల్లేష్ యాదవ్, బొడ్డుపల్లి మల్లేష్, అందుగుల ప్రవీణ్ ,రవి పాఠశాల నిర్వాహకులు సురేష్,చంద్రయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు

### బెల్ట్ షాపులు ఉన్నాయని నిరూపిస్తే వాటిని మూసేస్తా నకిరేకల్ ఎక్సైజ్ సీఐ మల్లయ్య నాలుగు మండలాల్లో ఒక్క బెల్ట్ షాప్ కూడా లేదు అని తెలిపిన ఎక్సైజ్ సీఐ




నల్గొండ టౌన్, వార్తా వేదిక సూర్య
నల్గొండ జిల్లా నకిరేకల్ వైన్ షాపులపై కల్తీ మద్యం అమ్ముతున్నారని ఫిర్యాదు పై తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ శాఖ
నకిరేకల్ మండలం కేతేపల్లి మండలం శాలిగౌరారం మండలం కట్టంగూరు మండలాల్లో బెల్ట్ షాపులు లేవు అని తెలిపిన నకిరేకల్ సిఐ మల్లయ్య ఎవరైనా బెల్ట్ షాపులు ఉన్నట్లు ఫిర్యాదు చేస్తే వాటి మూసివేస్తామని తెలిపిన ఎక్సైజ్ సీఐ మల్లయ్య

## ఘనంగా ధర్మ బిక్షం వర్ధంతి

గట్టుప్పల.మార్చి26.వార్త వేదిక సూర్య:



తెలంగాణ సాయుధ పోరాట యోధులు, కల్లు గీతా కార్మికుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతి వేడుకలను గట్టుప్పల లో గౌడ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్మ బిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం నిరుపేదల పక్షాన నిలబడి నిరంతరం ప్రజా పోరాటాలు నిర్వహించారన్నారు.ఈ కార్యక్రమంలో మాధగని సతయ్య,పెదగని రాఘువేంద్ర,మాధగని గోపాల్,పెదగని నరేందర్ రాములు యాదయ్య,బిమాగాని మల్లేశం,మాధగని రామస్వామి, పెదగని శ్రీనివాస్, బిమాగాని జంగయ్య,వెంకటేశం,చంద్రశేఖర్, పెదగని నాగరాజు, బిమాగాని సాయి,వంశీ మాధగని అర్జున్ తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో వికలాంగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి

### భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్



నల్లగొండ బ్యూరో, మార్చి 26 (వార్తా వేదిక సూర్య )
అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో వికలాంగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, లేనిపక్షంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని. భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ అన్నారు. గురువారం ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద 'కాంగ్రెస్ మేనిఫెస్టో సాధన సమితి' ఆధ్వర్యంలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్నా. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా. వికలాంగుల సంక్షేమాన్ని విస్మరించిందని, ముఖ్యంగా అధికారంలోకి వస్తే అదే నెల నుంచి వికలాంగుల పెన్షన్ 6000 పెంచుతామని. రాష్ట్రంలో వికలాంగుల అట్రాసిటీ చట్టం 2016 పూర్తిస్థాయిలో అమలు చేస్తామని. ఆర్టీసీలో వికలాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని. రాష్ట్రంలో వికలాంగుల బ్యాక్లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తామని. రాష్ట్రంలో వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖ కొనసాగిస్తామని. తన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి సంవత్సరాలు గడుస్తున్న నేటికీ వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ముందుకు రాకపోవడం దురదృష్టకరమని. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం వికలాంగులకు హామీ మేరకు రాష్ట్రంలో వికలాంగుల నెలవారీ పింఛన్ ను 6,000 రూపాయలకు, తీవ్ర వైకల్యం ఉన్నవారికి 15,000 రూపాయలకు పెంచాలని, రాష్ట్రంలో 2016 వికలాంగుల హక్కుల చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తూ ముఖ్యమంత్రి చైర్మన్ గా శాసనసభ కమిటీని, డీజీపీ కన్వీనర్ గా కార్యనిర్వాహక కమిటీని నియమించాలని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్లాగ్ ఉద్యోగాలను గుర్తించి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని. ఆర్టీసీ బస్సుల్లో హైదరాబాద్ మెట్రో రైల్ లోను 100% రాయితీతో వికలాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర స్థానిక సంస్థల్లో వికలాంగులకు ప్రత్యేక రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని,రంగారెడ్డి పరిధిలోని ఆర్థోపెడిక్ సదానాలను హైదరాబాద్ జిల్లా పరిధిలోకి మార్చాలని, ప్రభుత్వ జీవో 34 ప్రకారం సరిపడు సిబ్బందితో అన్ని జిల్లాలలో వికలాంగుల స్వతంత్ర కార్యాలయాలను ఏర్పాటు చేయాలని.ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగ విద్యార్థులకు సంపూర్ణ విద్య అందించటానికి అవసరమైన ప్రత్యేక శిక్షణ తీసుకున్న ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని ముఖ్యంగా 2024 డీఎస్సీలో మెరిట్ స్కోర్ సాధించిన స్పెషల్ బిఎడ్ అభ్యర్థులు అందరికీ వెంటనే ఉద్యోగ నియామక పత్రాలు అందించాలని. రాష్ట్ర రాజధాని తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ బధిరుల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన కోర్కెలను తీర్చకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వికలాంగులను ఏకం చేసి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్టీకి తగిన గుణపాఠం చెబుతామని గిద్దె రాజేష్ స్పష్టం చేశారు. ఈ రిలే నిరాహార దీక్షలో కాంగ్రెస్ మేనిఫెస్టో సాధన సమితి ముఖ్య నాయకులు చెరుకు నాగభూషణం, ఎం నరసింహ గౌడ్, మొహమ్మద్ మున్న షేక్ నయీమ్, వి భారతి, ప్రసాద్, వంశరాజ్, రామచంద్ర, మరుగుజ్జు మల్లేష్, లెప్రసి రమేష్, మారవేణి చంద్రశేఖర్ యాదవ్, మరుగుజ్జు సైదులు, వేణు గౌడ్, ఉదయ్ అసోసియేషన్ నాయకులు కొమరవెల్లి వీరేష్, వెంకటేష్, ఉదయ్, అశోక్ ముదిరాజ్, ఉస్మానియా యూనివర్సిటీ దివ్యాంగుల నాయకులు అశోక్, రాము, వాంకుడోత్ లాల్ సింగ్, కోర్ర రమేష్, తీవ్ర వైకల్యం గల వికలాంగుల సంఘం నాయకులు మహిళ నాయకురాలు రాజ్యలక్ష్మి, ధనమ్మ, తదితరులు పాల్గొనగా ఈ దీక్ష కు తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, బిఆర్ఎస్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి, వాసుదేవ రెడ్డి, బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ధీరావత్ మహేష్ నాయక్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, బిజెపి వికలాంగుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కొల్లి నాగేశ్వరరావు, జవాబు ఛానల్ నల్గొండ శ్రీనివాసులు, బి ఆర్ ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ, సిపిఐ ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ సంఘం నేత చిరంజీవులు, ప్రజా గాయకురాలు విమలక్క హాజరై మద్దతు తెలిపారు.

# మార్చి 30 న చలో హైదరాబాద్ లేబర్ కమిషనర్ ఆఫీస్



### సిఎస్సి హెల్త్ టెస్టులను రద్దు చేయాలి
### సిహెచ్ లక్ష్మీనారాయణ

నల్లగొండ బ్యూరో, మార్చి 26 (వార్తా వేదిక సూర్య )
మార్చి 30 న నిర్వహించే చలో హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని, తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్. లక్ష్మీనారాయణ కార్మికులకు పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండ భాస్కర టాకీస్ అడ్డా మీద కార్మికులతో కలిసి పోస్టర్ ఆవిష్కరణ చేశారు ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. భవన భవన నిర్మాణ రంగాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేసే కుట్ర చేస్తుందని అన్నారు. అందులో భాగంగానే సిఎస్సి హెల్త్ టెస్టులు ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అనుమతులని ఇచ్చి బోర్డులో ఉన్న డబ్బులను దుబారా చేస్తుందని దుయ్యబట్టారు. వెంటనే సిఎస్సి హెల్త్ టెస్టులను రద్దుచేసి ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన అనుమతిని ఉపసంహరించుకొని సహజ మరణానికి ఐదు లక్షల రూపాయలు చెల్లించాలని పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని జీవో నెంబర్ 12 ను సవరించి ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా కాకుండా వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికులకు సంక్షేమ పథకాలను అందించాలని అన్నారు. 60 సంవత్సరాలు పైబడిన కార్మికులకు పెన్షన్, పిల్లల చదువులకు స్కాలర్షిప్లు, గృహవసతి అడ్డాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వెల్ఫేర్ బోర్డు పెండింగ్ క్లెయిమ్ లకు కావలసిన నిధులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజర్ కమిటీని నియమించి బోర్డు నిధులను కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని అన్నారు. వెల్ఫేర్ బోర్డు నిధులు దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించాలని 2009 నుండి రెన్యువల్ కానీ 13 లక్షల పైగా ఉన్న లేబర్ కార్డులను యుద్ధ ప్రాతిపాదికన వెంటనే రెన్యువల్ చేయాలని. ఇండ్లు లేని భవన నిర్మాణ కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని అన్నారు.

యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుట రవీందర్ మాట్లాడుతూ.. వెల్ఫేర్ బోర్డు నుండి ప్రసూతి కానుక పెళ్లి కానుకలను లక్ష రూపాయలకు పెంచాలని గత ప్రభుత్వ హయాంలో ఇస్తామా అన్న మోటార్ సైకిల్ లను అర్హులైన ప్రతీ కార్మికుడికి ఇవ్వాలని తదితర సమస్యల పరిష్కారం కొరకు ఈ నెల 30న జరిగే కమిషనర్ కార్యాలయం ముట్టడిని భవన నిర్మాణ రంగంలో ఉన్న 54 రకాల కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు పోలే సత్యనారాయణ, సాగర్ల మల్లయ్య, నాంపల్లి శ్రీను, పురం నరసింహ, సైదా, రాజు, సోమ్లా దేవి, సతీషు, వెంకటయ్య, బంగారమ్మ బుజ్జి, భీమనపల్లి శంకర్, మంగమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## నియోజకవర్గ ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు

**- బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్**

దేవరకొండ మార్చి 26 (వార్తా వేదిక సూర్య):-
దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలంతా శ్రీరామ నవమిని భక్తి,శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. నవమి రోజున ప్రతి ఏటా వైభవోపేతంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించు కుంటారని అన్నారు. లోక కళ్యాణం కోసం ఎన్నోత్యాగాలను కోర్చిన సీతారాముల పవిత్ర బంధం అజరామరమైనదని,రాబోయే తరాలకు ఆదర్శనీయమైనదని ఆయన తెలిపారు. సీతారాముల ఆశీస్సులు ప్రజలకు ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవనం సాగించేలా దీవించాలని సీతారామ చంద్రమూర్తులను ప్రార్థించ నున్నట్టు ఆయన తెలిపారు. నియోజకవర్గ ప్రజలంతా సుఖ,సంతోషాలతో శ్రీరామనవమి జరుపుకోవాలని కోరారు

## నూతన గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న నల్లగొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ నాయక్, కేతావత్ భిల్యా నాయక్



దేవరకొండ మార్చి 26 ( వాస్తవ వేదిక సూర్య)
చింతపల్లి మండల పరిధిలోని ఎర్రమట్టి తండా కు చెందిన బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బాణవత్ శివ గారి నూతన గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్రకుమార్ నాయక్, కేతావత్ భిల్యా నాయక్ గారు ఈ కార్యక్రమంలో స్థానిక మాజి సర్పంచ్ జ్యోతి చందర్ నాయక్,నేనావత్ జైపాల్ నాయక్, నేనావత్ కిషన్ నాయక్,ఈరటి శేఖర్, కొప్పుల యాదయ్య,ఈరటి రమేష్,బాస్కర్, నరేష్, శ్రీను,మోతిరాం నాయక్ , తదితరులు పాల్గొన్నారు

# భువనగిరి జిల్లా కోర్టు అసోసియేషన్ అధ్యక్షులుగా నిసంగి విద్యాసాగర్




(యాదాద్రి భువనగిరి బ్యూరో): మార్చి 26 (వార్తా వేదిక సూర్య ) : యాదాద్రి భువనగిరి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు పోటాపోటీగా జరిగాయి. ఎన్నికల్లో గెలుపొందడానికి అభ్యర్థులు ఓటర్లను అన్ని రకాలుగా తాయిలాలు చెల్లించి ఓట్లుగా మలుచుకున్నారు. ఎంతో ఉత్కంఠ భరితంగా జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా సీనియర్ న్యాయవాది నిసంగి విద్యాసాగర్ విజయం సాధించారు. ఉపాధ్యక్షులుగా ఎస్ శారద, ప్రధాన కార్యదర్శిగా మెడబోయిన యాదగిరి, జాయింట్ సెక్రెటరీ సురేష్ ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులను సీనియర్ న్యాయవాదులు లు గోరుపల్లి శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్, గోద వెంకటేశ్వర్లు, బబ్బురి హరినాథ్, బొమ్మ వెంకటేష్ గౌడ్ షాలులతో సన్మానించారు. నిక అధికారులుగా జిట్టా భాస్కర్ రెడ్డి, సిద్ధిరాములు, శివ కిరణ్లు వ్యవహరించారు.

# యోగశిక్షణా తరగతుల బ్రోచర్ ఆవిష్కరణ




రామన్నపేట, మార్చి 26 (వార్తా వేదిక సూర్య) రామన్నపేటలో ఉన్నటువంటి అమృతవనం అగ్రిఫామ్ రిసార్ట్లో 29వ తారీకు నుంచి ఆరో తారీకు వరకు నిర్వహించడం జరుగుతున్నది. ప్రతిరోజు ఉదయం 5:30 నుండి 7 గంటల వరకు సాయంత్రం 6:30 నుండి 8 గంటల వరకు శిక్షణ నిర్వహించబడును. ఈ శిక్షణ తరగతుల బ్రోచర్ను గౌరవనీయులు రామన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు, సబ్ ఇన్స్పెక్టర్ డి నాగరాజు చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగినది, ఈ కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు శ్రీ యోగేశ్వర్ అమృతం అగ్రిఫామ్ రిసార్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీ కదారి చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు, ఈ తొమ్మిది రోజుల శిక్షణలో వ్యాయామాలు, ప్రాణాయామాలు, సూర్య నమస్కారాలు, ధ్యానం, ఆసనాలు నేర్పించడంతోపాటుగా సంపూర్ణ ఆరోగ్యానికి పచ్చి కూరగాయలతో అందించే అమృత ఆహారం అందించబడుతుంది అని గురూజీ తెలియజేశారు. ఈ శిక్షణలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి మానసిక ప్రశాంతతకి యోగ సాధన చాలా అవసరమని ప్రతి ఒక్కరి జీవితంలో యోగాన్ని ఒక భాగంగా చేర్చుకోవాలన్నారు. సబ్ ఇన్స్పెక్టర్ డి నాగరాజు మాట్లాడుతూ పెద్దలు ఆరోగ్యమే మహాభాగ్యం అటువంటి ఆరోగ్యాన్ని యోగసాధంతో కాపాడుకోవడం చాలా ఉత్తమమైన మార్గమని తెలియజేశారు.

# మోత్కూరు మండలాన్ని నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలి



మోత్కూరు, మార్చి 26 (వార్తా వేదిక సూర్య ): మోత్కూరు మండలాన్ని నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలని బిసి రిజర్వేషన్ సాధన సమితి బి.ఆర్.ఎస్.ఎస్. రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు మోత్కూరుకు వచ్చిన ఎమ్మెల్సీ నెల్లికంటే సత్యం కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యంత వెనుకబడిన మోత్కూరు అభివృద్ధిలో ఆమడ దూరంలో ఉందన్నారు.మోత్కూరు నియోజకవర్గంగా లేకపోవడం వల్ల విద్యా వైద్య రవాణామార్గంగా ఇక్కడ ప్రజలు నోచుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఆత్మకూరు (ఎం), గుండాల, అడ్డగూడూరు, మోటకొండూర్ మండలాల కలిపి మోత్కూరును నియోజకవర్గ ఏర్పడితే ఆయా మండలాల ప్రజలకు మంచి సౌకర్యం ఉందన్నారు.ఈ 5 మండలాలలో 90 గ్రామపంచాయతీలు 68 రెవెన్యూ గ్రామాలను ఉన్నాయని ఆయన దృష్టికి తెచ్చారు. నాడు రామన్నపేట, నేడు తుంగతుర్తి నియోజకవర్గంలో పెద్ద మండలమైన మోత్కూరు పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా ఉందన్నారు. మోత్కూరు నియోజవర్గం ఏర్పాటుకు శాసనమండలిలో ప్రస్తావించాలని ఎమ్మెల్సీ సత్యం ను కోరగా ఆయన హామీ ఇచ్చినట్లు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి జిల్లా నాయకులు కలిమెల నర్సయ్య, స్థానిక నాయకులు ఎడ్ల నరేష్, అన్నెపు భాస్కర్ ఎడ్ల పక్కిరు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ చేనేత కార్మికుల రుణమాఫీ విడుదల చేయాలని ఎమ్మెల్సీ కి వినతి



మోత్కూరు, మార్చి 26 (వార్త వేదిక సూర్య ): చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య కోరారు. గురువారం మోత్కూరుకు వచ్చిన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంకు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోచం కన్నయ్యతో కలిసి చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు చేనేత కార్మికులకు రుణమాఫీతో పాటు అనేక హామీలను ఇచ్చిందన్నారు.ఈ రుణమాఫీని పూర్తిగా అమలు చేయటం లేదన్నారు. యాదాద్రి జిల్లాలో రుణమాఫీ లిస్టు కాకపోవడంతో 60 మది చేనేత కార్మికులు త్రీవ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను హామీలు చేసే విధంగా శాసనమండలిలో ప్రస్తావించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు లక్ష్మీ నర్సయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి, చేనేత సహకార సంఘం అధ్యక్షులు జల్ది రాములు, నాయకులు పెండెం శ్రీనివాస్ తదితరులు.పాల్గొన్నారు.

# పెద్దమ్మ తండాలో లేఅవుట్ ఓపెన్ స్పేస్ భూములపై అక్రమ విక్రయాలు?

మహేశ్వరం, మార్చి 26 (వార్తా వేదిక సూర్య ) : మహేశ్వరం మండలం, పెద్దమ్మ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని వివిధ సర్వే నంబర్లలో ఉన్న వెంచర్లకు సంబంధించిన 10 శాతం (ఝుఎశీబ్ ాజూవఅ ాజూఝఎవ) భూమిని గ్రామ పంచాయతీకి అప్పగించకుండా అక్రమంగా విక్రయిస్తున్నారని, దీనిపై తక్షణమే విచారణ జరిపి న్యాయం చేయాలని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు నేనావత్ రూప్ సింగ్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత సోమవారం (23వ తేదీన) రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో జరిగిన 'ప్రజావాణి' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి గారికి ఈ విషయమై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామంలోని సర్వే నంబర్లు 196, 197, 172, 173, 198, 200, 176 లలో వెంచర్లు ఏర్పాటు చేసిన యజమానులు, నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీకి కేటాయించాల్సిన 10 శాతం భూమిని ఇవ్వకుండా అమ్ముకుంటున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు, నిన్న బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు డీఎల్పీఓ (ఋూూ) గారు సంబంధిత వెంచర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమక్షంలోనే అధికా రులు స్పందిస్తూ.. వచ్చే మంగళవారం నాటికి ఈ 10 శాతం భూమికి సంబంధించి పూర్తిస్థా యి చర్యలు తీసుకుని, పంచాయతీకి అప్పగి ంచేలా చూస్తామని హామీ ఇచ్చారని రూప్ సింగ్ వెల్లడించారు. వెంచర్లలోని ప్రజా అవసరాల కోసం కేటాయి ంచిన భూమిని తక్షణమే గ్రామ పంచాయతీకి స్వాధీనం చేసి, గ్రామాభివృద్ధికి సహకరించాలని ఆయన ఈ ప్రకటన ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు నేనావత్ రూప్ సింగ్ తో పాటు ఎ. బాబు పాల్గొన్నారు.



# మహనీయుల జయంతి జ్ఞాన పాదయాత్ర

(యాదాద్రి భువనగిరి బ్యూరో), మార్చి 26 (వార్తా వేదిక సూర్య ) :ఏప్రిల్ మాసం మహనీయుల జయంతి ఉత్సవలలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన ఉద్యమ కెరటం శ్రీకాంత చారి స్వస్థలం పొడిచేడు గ్రామం నుండి 22గ్రామాల మీదుగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పొలిటికల్ యువజన సమితి జిల్లా అధ్యక్షులు తంగళ్ళపల్లి గిరిధరాచారి తెలిపారు. 22 గ్రామాల మీదుగా 72 కిలోమీటర్లు జరిగే ఈ పాదయాత్ర భువనగిరి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం






వరకు చేరుకొని ముగిస్తుందని వివరించారు. తెలంగాణ సమాజ అభివృద్ధిని ఆకాంక్షించి చేస్తున్న ఈ పాదయాత్రలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని చారి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా గురువారం నాడు యాదాద్రి భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీ వాణి రవికుమార్ కరపత్ర ఆవిష్కరణ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, గ్రంథాలయ చైర్మన్ అవైయ్ చిస్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్లకు కరపత్రాలు ఇచ్చి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, అసెంబ్లీ అధ్యక్షులు నమోజ్ రాజు చారి, , కొంగరీ మహేష్, తొర్రి సురేష్ , పడిగం శ్రీనివాస్, కుంచం రాజు , మరియు తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగులకు 6000 పింఛన్ వెంటనే అమలు చేయాలి

- సింగారపు రమేష్




యాదాద్రి భువనగిరి, మార్చి 26 (వార్తా వేదిక సూర్య ) : రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం దివ్యాంగులకు 6000 పెంచన్, వృద్ధులకు ఒంటరి మహిళలకు 4000 పింఛన్ వెంటనే అమలు చేయాలని. దివ్యాంగుల వికలాంగుల హెల్పింగ్ సొసైటీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు సింగారపు రమేష్ ప్రభుత్వం డిమాండ్ చేశారు . ఈ సందర్భంగా పలు డిమాండ్లతో జరిగిన చలో బస్ భవన్, అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగులకు వృద్ధులకు ఒంటరి మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు.

# పేద ప్రజల ఆశాజ్యోతి కామ్రేడ్ బొమ్మగాని ధర్మ బిక్షం

- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి

చౌటుప్పల్ మార్చి 26 (వార్తావేదిక సూర్య): పేద ప్రజల ఆశాజ్యోతి కామ్రేడ్ ధర్మ బిక్షమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్ రెడ్డి అన్నారు. గురువారం స్వాతంత్ర సమరయోధులు నల్లగొండ మాజీ పార్లమెంట్ సభ్యులు ధర్మభిక్షం 15వ వర్ధంతి సందర్భంగా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని తంగేడుపల్లి రోడ్ లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు పర్యాయాలు ఎంపీగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి జిల్లాలో ఉన్న సమస్యలను పరిష్కరించారని తెలిపారు. అదేవిధంగా దున్నేవానికి భూమి కావాలని ,గీసేవానికే చెట్టు కావాలని ,పెద్ద ఎత్తున పోరాటాలు చేశారని తెలిపారు. ముఖ్యంగా రాచకొండ గుట్టల్లో ఏర్పాటు చేయదలచిన ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ కి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేసి రద్దు చేయించిన ఘనత ధర్మ బిక్షం దే అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపాలిటీ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, ఉడుత రామలింగం,గీత పని వాళ్ళ సంఘం నాయకులు నీళ్ల బిక్షపతి, కొండూరు వెంకటేష్, టంగుటూరి రాములు, రొండి నరసింహ, బద్దుల సుధాకర్ ,రోషనగారి అంజయ్య.దాసరి మనోహర్,కట్టెల లింగస్వామి,దాసరి కృష్ణ ,యాదయ్య,నీళ్ళ సంతోష,తదితరులు పాల్గొన్నారు .



# ఉత్కంఠ మధ్య రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎండి మజీద్ ప్రధాన కార్యదర్శి యాదాసు యాదయ్య ఎన్నిక



రామన్నపేట , మార్చి 26(వార్తా వేదిక సూర్య) రామన్నపేట బార్ సోసియేషన్ ఎన్నికలలో మూడోసారి అధ్యక్షులుగా మజీద్ , ప్రధాన కార్యదర్శిగా యాదాసు యాదయ్య పోటీపడగా విస్తృతంగా ప్రచారం నిర్వహించి న అనంతరంఎన్నికలు నిర్వహించగా మెజారిటీతో అధ్యక్ష కార్యదర్శులుఎన్నిక కావడం జరిగింది.రామన్నపేట బారసోసియేషన్ ఎన్నికలలో మూడవసారి అధ్యక్షులుగా ఎన్నికైన ఎండి మజీద్, కార్యదర్శిగా యాదసు యాదయ్య ఎన్నిక అలాగే ఉపాధ్యక్షులుగా సంగిశెట్టి బాలరాజు సహాయ కార్యదర్శిగా దినేష్ కోశాధికారి కూనూరు శ్రీనివాస్, స్పోర్ట్స్ అండ్ కార్యదర్శిగా శ్రవణ్ కుమార్, లేడీ రిప్రెసెంటివ్ గా రోసమ్మ థామస్, కార్యవర్గ సభ్యులుగా పాల్వంచ జగతయ్య, సోమ సతీష్ రెడ్డి, సయ్యద్ అజిజుద్దీన్ గా ఎన్నికైనట్టుగా ఎన్నికల అధికారి యేళ్ల శ్రీశైలం ప్రకటించారు.

# ధర్మ బిక్షం సేవలు చిరస్మరణీయం

▶▶ సుద్దాల గౌడ సంఘము అధ్యక్షుడు

యమగాని వెంకటేష్ గౌడ్

గుండాల,మార్చి 26 (వార్త వేదిక సూర్య) : పేద ప్రజల కోసం నిరంతరం శ్రమించిన బహుజన బిడ్డ బొమ్మగాని ధర్మ బిక్షం గౌడ్ సేవలు చిరస్మరణీయమని సుద్దాల గౌడ గీత సంఘం అధ్యక్షులు యమగాని వెంకటేష్ గౌడ్ అన్నారు.గురువారం నాడు వర్ధంతి సందర్భంగా మోత్కూరులో సుద్దాల గౌడ సంఘం ఆధ్వర్యంలో విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా యమగాని వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ భూస్వాముల పెత్తందారులకు, వ్యతిరేకంగా పేద వర్గాల కోసం పోరాటాలు నిర్వహించిన మహనీయులు ధర్మభిక్షం అని పేర్కొన్నారు. ఆనాడు రజాకార్ల ఎదిరించి భూమి, భుక్తి కోసం తెలంగాణ విముక్తి కోసం స్వాత్రంత్ర పోరాటంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు..గీత కార్మికులు హక్కుల సాధన కొరకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉద్యమ పోరు కొనసాగించిన ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సుద్దాల జై గౌడ ఉద్యమ నాయకులు గూడ రవి గౌడ్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.



# చలో ఢిల్లీని విజయవంతం చేయాలని కరపత్రం విడుదల

▶▶ బీసీ రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

▶▶ పల్లగొర్ల మోదీరాందేవ్

చౌటుప్పల్,మార్చి 26 (వార్త వేదిక సూర్య) : ఓబీసీ సమస్యల పైన మార్చి 30,31న జరగబోయే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చౌటుప్పల్ బస్టాండ్ వద్ద ఉన్న సాకలి ఐలమ్మ విగ్రహం వద్ద కరపత్రం విడుదల చేసి అభివాదం చేశారు ఎస్సీ ఎస్టీ బీసీ సంఘం నాయకులు, దీషి విద్యార్థి సంఘ రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ వారు మాట్లాడుతూ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ వీ ఆర్ కృష్ణన్న, బీసీ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ అన్న ఆధ్వర్యంలో బీసీ సమస్యల పరిష్కారం కోసం జాతీయ సెమినార్,జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని అన్నారు చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అలాగే ాజ, ాు,దీజ బీసీ జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, జన గణనలో కుల గణన చేయాలని,దేశవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్మెంట్ అమలు చేయాలని సుప్రీం కోర్టు హైకోర్టు న్యాయమూర్తులలో ఎస్సీ ఎస్టీ బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని దేశంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని గవర్నమెంట్ సంస్థలో ప్రైవేటీక రణ నిషేధించాలని బీసీ క్రిమిలేయర్ ను ఎత్తివేయాలని ప్రమోషన్లలో రిజర్వేషన్లు వర్తింప జేయాలని బీసీలంటే్ట కేవలం ఓట్లు వేసే యంత్రాలుగనే చూస్తున్నారు ఉద్యోగాలలో బీసీలు 7 శాతం గిట్ల లేకపోవడం సిగ్గుచేటు రాజకీయంగా 12 శాతం దాటలేదు బీసీలు,,రాష్ట్ర ప్రభుత్వం ఏమో బీసీలకు స్థానిక సంస్థల 42% రిజర్వేషన్ అని చెప్పి దాన్ని అమలు చేయకుండా తుంగలోకి తొక్కింది బడ్జెట్లో బీసీలకు తీవ్ర అన్యాయం చేసింది రాష్ట్ర ప్రభుత్వం మొన్న పెట్టిన బడ్జెట్లో 62% శాతం ఉన్న బీసీలకు 3 శాతం నిధులు కేటాయించడం దుర్మార్గం గత బడ్జెట్లో పదివేల కోట్ల నిధులు కేటాయిస్తే ఖర్చు చేసింది కేవలం 1800 కోట్లు బీసీల అంటే ఈ ప్రభుత్వానికి దున్నపోతు మీద వర్షం కురిసినట్లు ఉంది,బీసీల సత్తా ఐక్యతను రానున్న రోజుల్లో ఈ ప్రభుత్వం చూస్తాదని హెచ్చరించారు.

కామారెడ్డి డిక్లరేష న్ను అమలు చేయాలి విద్యార్థులకు రావాల్సిన ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ విడుదల చేయాలని సంక్షేమాష్టలకు సొంత భవనాలు నిర్మించాలని మెస్చార్జులు 3,000లకు పెం చాలని ,,, రాష్ట్ర ప్రభుత్వం బీసీ బిల్లుకు మద్దతు అని చెప్పి తీరా ఎలక్షన్ల టైం లో బీసీ బిల్లుకు గోవింద కొట్టింది రాష్ట్ర ప్రభుత్వానికి బీసీల పైన ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న పార్లమె ంటులో ప్రవేట్ బీసీ బిల్ పెట్టాలని డిమాండ్ చేశారు ఈ రాష్ట్ర ప్రభుత్వం చదువుకుందాం అంటే స్కాలర్షిప్ లు ఇవ్వదు రాజకీయంగా వద్దామంటే రిజర్వేషన్లు ఇవ్వదు ఎంతసేపటికి కమిషన్ వచ్చే దానికి మూటల అప్పజెప్పే పథకాలకు మాత్రమే ఈ రాష్ట్ర ప్రభుత్వం మొగ్గు చూపుతుంది బీసీలకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆర్ కృష్ణన్న ఆధ్వర్యంలో ఒక మిలిటెంట్ శక్తిగా ఏర్పడి ఉద్యమిస్తామని హెచ్చరించారు సమావేశంలో బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, సామాజిక వేత ఉద్యమకారుడు బెల్లి చంద్రశేఖర్, బీసీ యువజన సంఘం ఉమ్మడిజిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలకల శ్రీనివాస్,దాసరి లవ్లేష్, దాసరి శ్రీనివాస్, గోగు లింగం, బెల్లి మధుకర్,మహేష్, నరారి మల్లేష్, వీరయ్య, సైదుల్ గౌడ్, విగ్నేష్, సత్తయ్య, వీరన్న తదితరులు పాల్గొన్నారు



